ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
30 జనవరి, 2011

ENTERED



శవ 'సేవ'లు

హ్యాపీ బర్త్‌డే

(2011 జనవరి 30 నుంచి 2011 ఫిబ్రవరి 5 వరకు)

మేఘన
10సం॥,జనవరి-30
మంజుల-నగేష్
ఆరుట్ల-రంగారెడ్డి

డి. వర్ాలిక
1సం॥,ఫిబ్రవరి-5
మాధవి-నగేష్
శ్రీనివాసనగర్-ఖమ్మం

ప్రశాంతి(లక్కి)
1సం॥,జనవరి-2010
కోమలి-వాసు
చిలకలూరిపేట-గుంటూరు

అమాన్ తాజ్
3సం॥,జనవరి-2008
అనుబాషా-అక్బర్ బాషా
మట్లపాలెం-ప॥గో॥

వి.ధాత్రి
8సం॥,ఫిబ్రవరి-2
ప్రగతి-రామిరెడ్డి
అనంతపురం

దినేష్ కార్తీక్
1సం॥,జనవరి-2010
దీప-విశ్వనాథ్
హైదరాబాద్

ప్రజ్ఞ-ప్రేరణ
7సం॥,జనవరి-31
రాధిక-జగన్
అంబర్‌పేట్-హైదరాబాద్



కె. అవనిత్‌రెడ్డి
2సం॥,జనవరి-2009
అలఖా-విజిత్
అమెరికా

ఎం. లోహితశ్రీ
3సం॥,ఫిబ్రవరి-3
శ్రీలక్ష్మీశివకుమారి-శ్రీనివాసురెడ్డి
మాదల-గుంటూరు

ఎన్. తనూజ్ సాయి
3సం॥,జనవరి-31
అంజని-శ్రీనివాస్
చోడవరం-విశాఖ

జి. హర్షవర్ధన్
4సం॥,జనవరి-31
మాణిక్యం-శ్రీనివాసరావు
దిబ్బిడి-విశాఖ

శ్రీసాయి చరణ్
3సం॥,ఫిబ్రవరి-1
అనురాధ-గణేష్
గోషామహల్-హైదరాబాద్

సన మెహ్‌విష్
10సం॥,ఫిబ్రవరి-5
ఎస్.కె. సల్మా-సైదా
కొనిజర్ల-ఖమ్మం

దీక్షిత
జనవరి
ఎన్.విష్ణు-యేలేంద్ర
మాధవరం-నల్లగొండ

మనలో మాట



రచ్చబండ రాజకీయం

ఇంట గెలిచి రచ్చ గెలవాలి అన్నది ఒక సామెత. అచ్చం అలాగే చేయాలన్న రూలేమీ లేదు కాబట్టి- ఇంట పై'చేయి' సాధించలేని పరిస్థితిలో కూడా రచ్చకెక్కి రాజకీయాలు మాట్లాడవచ్చు! ఇంట్లో ఈగల మోత... బయట పల్లకీ మోత! అన్న సామెత ఇలాంటి అనుభవంలోంచి పుట్టిందే! రచ్చబండ రాజకీయాలూ, రచ్చబండ కబుర్లూ మనకేం కొత్తవి కావు. రాళ్లూ, రాజకీయాలూ తొలి నుంచీ ఉన్నవే! వాటి మధ్య అవినాభావ సంబంధం ఉందని ఏ రాయి సాక్షిగానైనా చెప్పవచ్చు.

కొంతమందికి ఎవరో ఒకరి మీద రాయి వేయందే రోజు గడవదు. కొందరికి రాజకీయం నాలుగు రాళ్లు వెనకేసుకునే వ్యాపారం. ప్రత్యర్థి సభలపై రాళ్లేయడం అంత ఆషామాషీ కాదు. చాలాసార్లు రాయి రెడీమేడ్ ఆయుధంగా చేతికి అందివస్తుంది. చుట్టూ అనిశ్చితి నెలకొంటున్న ప్రస్తుత తరుణంలో రాష్ట్ర ముఖ్యమంత్రికి కూడా 'రచ్చబండే' మార్గదర్శిగా కనపడింది. ఏదో ఒకలాగా జనం మధ్యకు వెళ్లడం మంచిదే కానీ, నెలల తరబడి పెండింగులో ఉన్న వినతులనూ, విజ్ఞప్తులనూ పరిష్కరించకపోతే- పథకం పారదు. హామీలతోనో, హంగామాతోనో కాలం నెట్టుకుపోయే రోజులు పోయాయి. మునుపటి ముఖ్యమంత్రులు హామీల ఆప్షన్‌ను పక్కాగా వాడేయడంవల్ల- ఈ సిఎంకి మిగిలింది ఆచరణలో చూపడమే! ఇల్లు, ఇంటిస్థలం, రేషను కార్డు వంటి అభ్యర్థనలు '...మళ్లీ మొదలెట్టు..' అంటే కుదరదు. ఉత్తరాంధ్ర పర్యటనలో మహిళలు సిఎంకు అందుకనే అలాంటి ఝలక్‌లిచ్చారు.

ఇదేదో 'రక్ష'బండ అవుతుందని తలపోస్తే- అక్షరాలా 'రచ్చ'బండే అవుతోంది. జనం ప్రశ్నల మీద ప్రశ్నలు కురిపిస్తుంటే- ప్రజా ప్రతినిధుల గుండెల్లో బండరాళ్లు పడ్డట్టు అవుతుంది. రచ్చబండ కాస్తా... ఉతికి ఆరేసే చాకిరేవుగా మారిపోతోంది. నేతలు షరతులూ, పరిమితులూ పెడుతున్నా; మాట్లాడొద్దని వారిస్తున్నా వాతలు తప్పటం లేదు. తెలంగాణాలో అయితే మంత్రులను వెంటపడి తరుముతున్నారు. ధరలు మండిపోయి, డొక్కలు ఎండిపోయి, జనం ఇక్కట్లు పడుతుంటే- కొంతమంది అధికార నేతలు పరాచికాలకు తెగిస్తున్నారు. అలాంటి సందర్భాల్లో జనాగ్రహం కట్టలు తెంచుకుంటోంది. జనం అవసరాలను పట్టించుకోకుంటే- రచ్చబండ రోకలిబండై తల బొప్పి కట్టిస్తుందన్న నిజం ముఖ్యమంత్రికీ, మంత్రులకూ తెలిసి రావాలి! చాలాచోట్ల సభల్లో ఇలాంటి 'పారాలే' ఆవిష్కృతమవుతున్నాయ్!

స్పందించి సరి చేసుకుంటే సరేసరి!
లేకుంటే... రచ్చబండే రేవుబండ!

★

ఈ సంచికలో....

టపా	...	2
కవిత్వమ్	...	3
రుచి	...	7
సీరియల్	...	8
నవ్వుల్ పువ్వుల్	...	10
తెల్సా	...	11
అట్టమీది కథ	...	14
కథ	...	18
వికాసం	...	20
ఈ పేజ్	...	21
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...

సినిమా కబుర్లు ... 4
వినోదభరిత చిత్రాలకు చెరగని ముద్ర



చూద్దామా ... 12
మంచు దుప్పటి

కొత్త పుస్తకాలు ... 17
అభ్యుదయవాదులకు చిరుకానుక



ఉల్లి లొల్లి....

సంక్రాంతి సంబరాల ముఖచిత్రంతో జనవరి 15 స్నేహ సంచిక పాఠకులను ఆకట్టుకుంది. వివిధ ప్రాంతాల్లో సంక్రాంతి పర్వదినాన్ని ఎలా జరుపుకుంటారో కళ్లకు కట్టినట్లుగా వివరించారు. 'వికాసం' పేజీ ప్రయోజనాత్మకంగా వుంది. బాల పేజీ పర్వాలేదు. 'ఈ పేజీ' ద్వారా కంప్యూటర్ గమ్మత్తులు ఒక్కొక్కటిగా తెలుస్తున్నాయి.'కవిత్వం' పేజీలో కవితలన్నీ భావగర్భితంగా, ఉన్నతమైన ఆలోచనల్ని రేకెత్తించేలా ఉన్నాయి. తాడు మీద నిద్ర, ఎగిరే చేప, వృద్ధ మార్జాలం విశేషాలతో 'తెల్సా' పేజీ ఆకట్టుకుంది. 'రుచి' వంటకాలన్నీ చవులూరింపజేస్తున్నాయి. 'కొత్త పుస్తకాల' సమీక్ష ద్వారా ఆయా సంచికల ముఖ్య ఉద్దేశ్యం అర్థమవుతోంది. కాస్త సస్పెన్స్... ఉత్కంఠతో 'వియత్నాం వీరుడు ఎన్‌గుయెన్ వాన్‌ట్రాయ్' కొనసాగుతోంది. 'చూద్దామా' ద్వారా దక్షిణాఫ్రికా వెళ్లగలిగాం. మనలోమాట... తల్లి చేసే మేలే కాదు ఉల్లి చేసే లొల్లి కూడా ఎవరూ చేయరేమో అనిపించింది.

నేమాన సుభాష్ చంద్రబోస్,
శ్రీకాకుళం.

ఆసక్తికరంగా వాన్‌ట్రాయ్

జనవరి 15 నాటి ఆదివారం అనుబంధం సంచిక బాగుంది. 'ఎన్‌గుయెన్ వాన్‌ట్రాయ్' సీరియల్ ఆసక్తికరంగా సాగుతోంది. 'మా ఊళ్లో సంక్రాంతి' విశేషాలు చాలా బాగున్నాయి. ఎన్నో కొత్త విషయాలు ఈ వ్యాసం ద్వారా తెలిశాయి. ' రెండు గంటలు రెండు జీవితాలు' కథ బాగుంది. దీని ద్వారా మంచి విషయాలు చెప్పారు.అలాగే గ్లామర్ ప్రపంచమైన సినీ ఫీల్డులో పెద్దవారి ఇంటర్వ్యూల ద్వారా వారు పడ్డ కష్టనష్టాలు, ఒడిదుడుకులు ఇస్తే బాగుంటుంది.

కూన మల్లేశ్వరరావు,
మల్కాపురం, వైజాగ్.



ఆకట్టుకున్న చూద్దామా

లక్షకోట్ల బడ్జెట్ బాగుంది. ఎంత మంది రైతులు చనిపోయినా మన పాలకులకు పట్టదు. అదే ఏ మంత్రికైనా అనుకున్న పదవి రాకపోతేనా ఇక అంతే! రాష్ట్రమొత్తం ఏమైనా పర్వాలేదు. అపోజిషన్ వాళ్లమీద అప్పటి వరకూ గుర్తుకు రాని నేరాలన్నీ గుర్తుకొస్తాయి. 'చూద్దామా'లోని దక్షిణాఫ్రికా విశేషాలు బాగున్నాయి.

సుజాత, నూజివీడు.

ఆత్మ విశ్వాసం ముఖ్యం

అట్టమీది కథ 'మా ఊళ్లో సంక్రాంతి' వ్యాసం బాగుంది. ఇలా వేర్వేరు ప్రాంతాల్లో ఈ పండుగను ఎలా చేసుకుంటారో వివరించడం బాగుంది. 'వికాసం' లో చెప్పినట్లుగా ఆత్మ విశ్వాసం ఉంటే ఎంతటి కష్టాన్నైనా అధిగమించొచ్చు. అదే లేకపోతే ప్రతి చిన్న సమస్యా కష్టంగా, భారంగా అనిపిస్తుంది. చిన్న కథ బాగుంది.

విజయ్, గుంటూరు.

కవిత బాగుంది

మార్క్సిస్ట్ - లెనినిస్ట్ సిద్ధాంతమైన గతితార్కిక భౌతికవాదం, చారిత్రక భౌతికవాదాన్ని చారిత్రక పరిణామాలకి అన్వయించాలి. కారల్ మార్క్స్ -ఏంగిల్స్ రచించిన దోపిడీ వ్యవస్థను కూలదోయడానికి ఉపయోగపడే సిద్ధాంత గ్రంథమైన "కమ్యూనిస్టు ప్రణాళిక" గురించి పరిచయం చేసిన పుస్తకాల గురించి తెలియ జేసినందుకు ధన్యవాదాలు. 'లక్షకోట్ల బడ్జెట్ - పదివేల

ఆత్మహత్యలు' కవిత బాగుంది.

టి. శ్రీరామమూర్తి, గాజువాక.

కన్నీళ్లు ఆగలేదు

జనవరి 9 ఆదివారం అనుబంధంలో రావుల పుల్లాచారి 'రిక్షాతాత' కథ చాలా బావుంది. దమయంతి పాత్ర ద్వారా రిక్షాతాతను ఆదుకున్నారు. నేడు రిక్షాకార్మికులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పేదరికం, దిక్కూమొక్కూలేని ఒంటరి జీవితం గడుపుతున్న అభాగ్యులు చాలా మంది వున్నారు. దయమంతిలా మనసున్న వారికే కార్మికుల కష్టాలు అర్థమౌతాయి. కానీ అలాంటి వారు ఎంతమంది ఉంటారు? కథ ఆసక్తిగా చదివించేలా ఉంది. అనాథ శవాన్ని గుర్తు పట్టి కూడా సంతకం పెట్టడానికి వెనుకాడే వారు చాలా మంది ఉంటారు. అలాంటి వారిని చూస్తే బాధకలుగుతుంది. ఈ కథ చదివాక హృదయం పిండేసినట్లనిపించింది. కన్నీళ్లు వచ్చాయి. ఎందుకంటే నాకు రిక్షా కార్మికులతో ఉన్న అనుబంధం అలాంటిది. వారి బాధలు, ఆవేదనలు తెలుసు. నేను రిక్షా కార్మిక నాయకుడిని. ఇంత మంచి కథను అందించిన ప్రజాశక్తికి, రావుల పుల్లాచారి గారికి అభినందనలు.

పరుచూరి వెంకటేశ్వరరావు,
మంగళగిరి.

★

రోల్ నెంబర్ 16

అతను పిలుస్తూనే ఉన్నాడు
హాజరు పట్టికలోంచి
అమ్మానాన్నలు పెట్టని పేర్లను
అతను పిలుస్తూనే ఉన్నాడు
రోల్ నెంబర్ 1
ఎస్సార్...
రోల్ నెంబర్ 2
జీ సార్....
రోల్ నెంబర్ 3
ప్రజెంట్ సార్....
అతను పిలుస్తూనే ఉన్నాడు
రోల్ నెంబర్ 4

రోల్ నెంబర్ 5



గొంతు వినబడని చోట
నిశ్శబ్దం సుడులు తిరుగుతోంది
మనిషి కనిపించని చోట
మహా శూన్యం వెక్కిరిస్తోంది
అతను పిలుస్తూనే ఉన్నాడు
రోల్ నెంబర్ 6

రోల్ నెంబర్ 7

ఒక రెక్కకు గోనె సంచిని తగిలించుకుని
చెత్త కుప్పనే
పూలతోటలుగా గాలిస్తూ
కాగితాల పూలను ఏరుకుంటూ
ఆ గదివైపు
రెండు చూపుల తూనీగలను
ఆశగా పంపిందో సీతాకోకచిలుక
గొంతు వినబడని చోట
నిశ్శబ్దం సుడులు తిరుగుతోంది
అతను పిలుస్తూనే ఉన్నాడు
రోల్ నెంబర్ 8



మటన్ కత్తిమీద అక్షరాలను
మాంసం ముక్కలుగా తెగ్గొట్టుకుంటూ
ఓ పావురాయి రెక్క
ఆ గదివైపు
రెండు చూపుల ఈకల్ని రాల్చింది
మనిషి కనిపించని చోట
మహా శూన్యం వెక్కిరిస్తోంది
అతను పిలుస్తూనే ఉన్నాడు
రోల్ నెంబర్ 9
లూజయిన బైకు బోల్టులో
తన చర్మాన్నే వాచరుగా తొడుగుతూ
ఓ లేడికూన... ఆ గదివైపు
రెండు చూపుల చుక్కల్ని రాల్చింది
గొంతు వినబడని చోట
నిశ్శబ్దం సుడులు తిరుగుతోంది
అతను పిలుస్తూనే ఉన్నాడు
రోల్ నెంబర్ 10
ఇక అవసరం లేదనుకున్న
యూనిఫామ్‌తో
కాఫీ కప్పుల్ని తుడిచి పెడుతున్న
ఒక లేత గులాబి... ఆ గదివైపు
రెండు చూపుల రెక్కల్ని రాల్చింది
మనిషి కనిపించని చోట
మహాశూన్యం వెక్కిరిస్తోంది



అతను పిలుస్తూనే ఉన్నాడు
రోల్ నెంబర్ 11
శతాబ్దాల తరబడి
అతను పిలుస్తూనే ఉన్నాడు
డెబ్బయిల్లో మొదలయి
నలభైల్లోకొచ్చిన నాకూ...
అతని పిలుపు
స్పష్టంగానే వినబడుతూనే ఉంది
అయినా ఆ గదిలో
ఇంకా
వినబడని గొంతులు
కనిపించని యూనిఫామ్‌లు
పుస్తకాల్లేని బ్యాగులు
పలకల్లేని బలపాలు
ఆ గది ఛాయలకే రాలేని లేతకాళ్లు
ఆ గది తలుపుల్ని స్పర్శించలేని లేలేత చేతులు
ఇంకా చాలానే ఉన్నాయి
అతను పిలుస్తూనే ఉన్నాడు
రోల్ నెంబర్ 12

ఈ నెంబర్లన్నీ
ఆ గదిలోకి వొచ్చే
రోజొకటి వస్తుందని
ఆశ కాబోలు....
అతనింకా పిలుస్తూనే ఉన్నాడు...
రోల్ నెంబర్ 13

రోల్ నెంబర్ 14

రోల్ నెంబర్ 15

రోల్ నెంబర్ 16
అతనింకా పిలుస్తూనే ఉన్నాడు...

- చిత్తలూరి సత్యనారాయణ



బహుశా ఈ తరం సినీ ప్రేక్షకుల్లో ఆయన సినిమాలు చూడని వారుండరు. పాత తరం వాళ్ళకు సైతం ఉపగ్రహ టీవీ చానళ్ళలో పదే పదే వచ్చే సినిమాల ద్వారా ఆయన సుపరిచితులే. వెండి తెర నుంచి బుల్లి తెర దాకా ఎక్కడ చూసినా ఆయన సినిమాలకు అందరూ ఆనందించినవారే! అందుకే, ఆయన అందరివాడయ్యారు. దర్శకులు జంధ్యాల, ఆ తరువాతి తరంలోని రేలంగి నరసింహారావు తరువాత తెలుగు తెరపై హాస్యానికి పెద్ద పీట వేసిన ప్రముఖ దర్శకుడిగా గుర్తింపు సంపాదించుకున్నారు. ఇ.వి.వి.గా తెలుగు సినీ లోకం పిలుచుకొనే ఈదర వీర వెంకట సత్యనారాయణ వర్తమాన తెలుగు సినీ చరిత్రలో ప్రత్యేక స్థానం నిలుపుకొన్నారు. పెద్ద హీరోలతో భారీ బడ్జెట్ చిత్రాలు తీసి, చిన్న తారలతో ఆలోచింపజేసే సినిమాలు రూపొందించి, నలుగురినీ నవ్వించి, కవ్వించిన దర్శక - నిర్మాత ఇ.వి.వి.

- రెంటాల జూనియర్

వినోదభరిత చిత్రాలకు చెరగని సంతకం

దర్శకుడు జంధ్యాల దగ్గర దర్శకత్వ శాఖలో సహాయకుడిగా పనిచేసి, ఆ పైన దర్శకుడైన ఇ.వి.వి. సినిమాలంటే వినోద ప్రియులకు 'ఆ ఒక్కటీ అడక్కు', 'అప్పుల అప్పారావు', 'ఎవడిగోల వాడిది', 'చాలా బాగుంది' లాంటి సినిమాలు గుర్తొస్తాయి. 'చెవిలో పువ్వు' మొదలు 'జంబలకిడిపంబ', 'వీడెక్కడి మొగుడండీ', 'ఎవడి గోల వాడిది', 'తొట్టి గ్యాంగ్', 'బెండు అప్పారావు' లాంటి ఇ.వి.వి. సినిమాల పేర్లు విన్నప్పుడల్లా తెలుగు ప్రేక్షకులు ఠక్కున నవ్వేస్తారు. విభిన్నమైన టైటిల్స్ పెట్టడం, గోదావరి జిల్లా యాసలో కొన్ని పాత్రలతో సంభాషణలు చెప్పించడం, సినిమాలోని పాత్రల్లో అధిక భాగం వినోదం పంచడం - ఇవన్నీ తెలుగు సినిమాలో ఇ.వి.వి. మార్కు ముద్ర!

జీవితపు చదువుతో పైపైకి...

బడిలో చదివింది తక్కువైనా, బతికి చెడ్డ పెద్ద రైతు కుటుంబం బాధ్యత మొత్తాన్నీ మోసిన కొడుకుగా ఆయన జీవితంలో చదువుకొన్నదే ఎక్కువ. 1958 జూన్ 10న పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరులో పుట్టిన ఇ.వి.వి. కుటుంబం నిడదవోలు మండలం కోరుమామిడిలో స్థిరపడింది. చిన్నప్పటి నుంచీ సినిమాలంటే ప్రాణమైన ఇ.వి.వి. ఇంటర్‌లో తప్పినా, జీవితంలో అనుకున్నది సాధించి సినీ జీవితంలో పాసయ్యారు. సరస్వతీ కుమారితో 19వ ఏటే పెళ్ళయి, ఇద్దరు కుమారులు పుట్టిన తరువాత సినిమాల్లో అవకాశం కోసం మద్రాసు వచ్చిన ఇ.వి.వి. ప్రముఖ నిర్మాత 'నవత' కృష్ణంరాజు సాయంతో దర్శకత్వ శాఖలో చేరారు. 'ఓ ఇంటి భాగోతం' చిత్ర దర్శకుడు దేవదాస్ కనకాల దగ్గర సహాయకుడిగా కెరీర్ మొదలు పెట్టి ఆపై జంధ్యాలకు కుడిభుజమైన కో-డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. కష్టపడి పనిచేయడాన్ని ప్రేమించి, సోమరితనాన్ని ద్వేషించే తత్వమే ఇ.వి.వి. ఆ తరువాత ఓ పెద్ద దర్శకుడిగా వెలుగొందడం వెనుక ఉన్న విజయ రహస్యం. దర్శకుడిగా తొలి చిత్రం 'చెవిలో పువ్వు' పరాజయం పాలైనా, తనను నమ్మి నిర్మాత డి. రామానాయుడు ఇచ్చిన 'ప్రేమ ఖైదీ' అవకాశంతో దర్శకుడిగా ఘన విజయం సాధించారు. ఆ తరువాత వరుస విజయాలతో తారాపథం చేరుకున్నారు. కృష్ణ ('తెలుగు వీర లేవరా!'), శోభన్‌బాబు ('ఏవండీ ఆవిడ వచ్చింది'), చిరంజీవి ('అల్లుడా! మజాకా!), బాలకృష్ణ ('గొప్పింటి అల్లుడు'), నాగార్జున ('హలో బ్రదర్'), వెంకటేష్ ('ఇంట్లో ఇల్లాలు - వంటింట్లో ప్రియురాలు'), పవన్ కల్యాణ్ (హీరోగా తొలి చిత్రం 'అక్కడ అమ్మాయి - ఇక్కడ అబ్బాయి') లాంటి అగ్ర హీరోల మొదలు రాజేంద్రప్రసాద్ లాంటి నవరస నాయకుడితో, శ్రీకాంత్, వడ్డే నవీన్ లాంటి చిన్న హీరోలతో - ఇలా అందరితో సినిమాలు తీసిన ఈ తరం దర్శకుడు ఒక్క ఇ.వి.వియే!

వినోదభరిత చిత్రాలకే ఓటు

ఇ.వి.వి. అటు ప్రేమకథలూ ఇటు సెంటిమెంట్‌తో వండి వడ్డించిన నాటకీయ కథలూ అందించారు. 'ఆమె' (1994), 'అమ్మో! ఒకటో తారీఖు' (2001) లాంటి చిత్రాలను ఆయన రూపొందించి, ప్రశంసలను పొందినప్పటికీ, జనం మాత్రం ఆయనపై ప్రధానంగా వినోదభరిత చిత్రాల దర్శకుడనే ముద్రే వేశారు. ఒకానొక దశలో ఆ ముద్ర నుంచి తప్పించుకొని, జీవిత సమస్యల నేపథ్యంలో చిన్న బడ్జెట్ చిత్రాలతో పెద్ద ప్రయోగాలు చేయాలని ఆయన ప్రయత్నాలు కూడా చేశారు. కానీ, ఆ సినీ ప్రయత్నాలేవీ ప్రేక్షకుల ఆదరణకు నోచుకోకపోవడంతో మళ్ళీ తనకు అలవాటైన బాణీలోనే కామెడీ చిత్రాల సృష్టికర్తగానే మిగిలిపోయారు.

సినీ రచయితల శ్రీకృష్ణదేవరాయలు

కథ, మాటల రచన నుంచి జంధ్యాల దర్శకత్వం వైపు మళ్ళితే, ఆయన శిష్యరికంలో ఎదిగిన ఇ.వి.వి.లో కూడా మాటల విరుపు, పాత్రచిత్రణలో చరుపు ఎక్కువే. స్వయంగా ఎన్నో కథలు, స్క్రిప్టులు రాసిన ఇ.వి.వి. తన చుట్టూ ఏకంగా ఓ రచయితల ఆస్థానమే నడిపేవారంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఆయన దగ్గర ఒక్కో కథకూ కనీసం ఆరేడుగురు స్క్రిప్టు రచయితలు పనిచేసేవారని ఎరిగినవాళ్ళు చెబుతారు. ప్రతి సినిమాకూ అలా కనీసం ఆరేడు వెర్షన్లు రాయించుకొని, ఆ తరువాత వాటన్నిటి నుంచి ఉత్తమ అంశాలన్నిటినీ తీసి గుదిగుచ్చేవారు. స్వయంగా స్క్రిప్టుకు తుదిరూపమిచ్చేవారు. ఇ.వి.వి. సినిమాల్లో అన్నేసి రకాల పాత్రలూ, చూసినప్పుడల్లా నవ్వించే అన్నేసి మాటలు ఉండడానికి కారణం అదే! పక్కవాడితో మామూలుగా మాట్లాడుకొనే ఫక్కీలోకి తెలుగు సినీ సంభాషణల్ని మలుపు తిప్పిందీ ఆయనే. అలాగే, ఆ పచ్చి వ్యావహారికంతో

శిష్టమనిపించుకోని మాటలను చాలాసార్లు సినిమా డైలాగుల స్థాయికి తెచ్చిన పాపం, పుణ్యం కూడా ఆయనవే! ఒకే గదిలో ఇద్దరు ముగ్గురు పాటల రచయితలు కూర్చొని, తమకిచ్చిన ఆ యా సందర్భాలకు తగ్గట్లు పాటలు అల్లడం, ఒకరి రచన మరొకరికి వినిపించుకోవడం, నవ్వుతూ తుళ్ళుతూ అలసట, అసూయ లేకుండా పని చేయడం ఆధునిక తెలుగు సినిమా చరిత్రలో బహుశా ఇ.వి.వి. చిత్రాలకే సాధ్యమైంది. "నేను, 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి, వెన్నెలకంటి – ఇలా అందరం ఏ ఇబ్బంది లేకుండా ఒకే గదిలో కూర్చొని, పాటలు రాసిన సందర్భాలున్నాయి. ఎంతోమంది మాటలు, పాటల రచయితలతో ఇ.వి.వి. ఆస్థానం కళకళలాడేది. ఒక్క మాటలో అది రచయితలకు భూతల స్వర్గం" అని 'అప్పుల అప్పారావు' (1991) మొదలు ఇ.వి.వి. దర్శకత్వంలో దాదాపు 22 చిత్రాల్లో 70కి పైగా పాటలు రాసిన గీత రచయిత భువనచంద్ర తెలిపారు. 'ఈ జీవన తరంగాలలో...' ('జీవన తరంగాలు'), 'ఆకాశ దేశాన ఆషాఢ మాసాన...' ('మేఘ సందేశం') పాటలంటే మహా ఇష్టపడే ఇ.వి.వి.కి సంగీతం మీద కూడా మంచి పట్టు ఉండేదట! శివరంజని రాగమంటే ఆయనకు బాగా ఇష్టం. అందుకే, ఆయన తన చిత్రాల్లో ఆ రాగఛాయల్లో ఎక్కువ పాటలకు బాణీలు కట్టించుకున్నారు. అలాగే, 'రాజ్ – కోటి' జంటగా చేస్తున్న కాలం నుంచి కోటితో ప్రత్యేక అనుబంధం ఉన్న ఇ.వి.వి, పలు సినిమాలకు కోటితో సంగీతం చేయించుకున్నారు.

కసి, పట్టుదలతో నిర్మాణంలోకి!

అనుకున్నది సాధించాలనే పట్టుదల, అందుకోసం నిరంతర కృషి కూడా ఇ.వి.వి.లో ఎక్కువే! 2000వ సంవత్సరానికి ముందు ఊహించని రీతిలో ఇ.వి.వి. సినిమాలు కొన్ని వరుసగా పరాజయం

'కత్తి కాంతారావు'లో... నరేష్, కామ్నా

పాలయ్యాయి. అప్పటి దాకా జేజేలు కొట్టి, సినిమాలు చేసి పెట్టమని తిరిగిన సినీమా(యా) జనం ముఖం చాటేశారు. ఆ సంఘటన ఆయనలోని కసిని మరోసారి తట్టి లేపింది. 'ఎవరూ తీయకపోతేనేం, దర్శకుడిగా నాలోని ప్రతిభ మరోసారి చాటడానికి నేనే సినిమాలు తీస్తా'నంటూ ఆయన నిర్మాత అవతారం కూడా ఎత్తారు. అప్పటి దాకా దర్శకుడిగానే ఉన్న ఆయన సొంత చిత్ర నిర్మాణాలు కూడా మొదలుపెట్టారు. మామూలు సంప్రదాయాలకూ, సెంటిమెంట్లకూ భిన్నంగా ఆయన తన చిత్ర నిర్మాణ సంస్థ పేరును కూడా విభిన్నంగా పెట్టారు. 'ఇ.వి.వి. సినిమా' అంటూ తన పేరునూ, తన చిత్రాల తాలూకు ముద్రనూ గుర్తుచేస్తూ స్వీయ చిత్ర నిర్మాణ సంస్థను నెలకొల్పారు. 'చాలా బాగుంది'తో చిత్ర నిర్మాణం మొదలుపెట్టి, మళ్ళీ విజయాల బాట అందుకున్నారు. "నా అనుకున్న నిర్మాతలు నన్ను విడిచి వెళ్ళిపోయారు. డబ్బే ప్రధానమైన ఈ సినీమా(యా) వ్యాపారంలో ఇది సాధారణమే. దీని వల్ల చాలామంది అసలు రంగు నాకు తెలిసింది. దాంతో నా అహం దెబ్బతిని, నిర్మాతగానూ మారాను" అని అప్పట్లో ఇ.వి.వి. ఈ వ్యాస రచయితతో తన మనసులో మాట పంచుకున్నారు.

హిట్లు ఇ.వి.వి.కి కొత్తేమీ కాదు. ఆ మాటకొస్తే, కెరీర్ మొదట్లో వరుసగా 12 చిత్రాలను హిట్ చేసిన దర్శకుడిగా కూడా ఆయన ఘనత సాధించారు. ఇ.వి.వి.కి మరో రికార్డు కూడా ఉంది. తెలుగు సినిమాల్లోకెల్లా అత్యంత పొడవాటి టైటిల్ కూడా ఆయన స్వయంగా నిర్మిస్తూ, దర్శకత్వం వహించిన సినిమాయే! ఆ సినిమా పేరు – 'మా ఆవిడ మీదొట్టు, మీ ఆవిడ చాలా మంచిది'. చాలామందికి తెలియనిది ఏమిటంటే – భార్గవ్ ఆర్ట్స్ అధినేత ఎస్. గోపాలరెడ్డి నిర్మాతగా, బాలకృష్ణ హీరోగా తయారైన 'మాతో పెట్టుకోకు' సినిమాకు కూడా మొదట ఇ.వి.వి.యే దర్శకుడు. మద్రాసులోని సముద్ర తీరంలో ప్రారంభ సన్నివేశం జరుపుకొన్న ఆ చిత్రానికి ఆ పేరు పెట్టింది కూడా దర్శకుడు ఇ.వి.వి.యే! కానీ, ఆ తరువాత ఇతర కారణాల వల్ల ఆయన ఆ చిత్ర దర్శకత్వం నుంచి పక్కకు తప్పుకోవాల్సి వచ్చింది.

బూతు కామెడీలోనూ సిద్ధహస్తుడు

అయితే, ఇ.వి.వి. తీసిన సినిమాలన్నీ మహాద్భుతం, సకుటుంబ వినోదాత్మకాలే అనుకోవడం పొరపాటే. ఆయన చిత్రాల్లోనూ మచ్చలు లేకపోలేదు. ఒక్కసారి గమనిస్తే, ఆయన వినోదాత్మక చిత్రాల్లో సైతం పరిధిని దాటిన మాటలు, చేష్టలు కొల్లలుగా వినిపిస్తాయి, కనిపిస్తాయి. 1990లలో ఒకానొక దశలో 'సీతారత్నం గారి అబ్బాయి' (1992) లాంటి ఇ.వి.వి. చిత్రాల్లో ద్వంద్వార్థ సంభాషణలు ఓ రివాజు. చిరంజీవి 'అల్లుడా

ఇవివి కుటుంబం



ప్రతిభావంతుల పరిచయకర్త

ఒకప్పుడు అవకాశాల కోసం నానా ఇబ్బందులూ పడ్డ ఇ.వి.వి. చివరి రోజుల వరకూ తన మూలాల్ని మర్చిపోలేదు. అందుకే, ప్రతిభ ఉండి, అవకాశాల కోసం ఎదురుచూస్తున్న వాళ్ళనూ, ఛాన్సుల కోసం తనను అర్థించినవాళ్ళనూ వీలైనంత వరకు ప్రోత్సహించేవారు. అది ఆయనలోని మరో సుగుణం. పత్రికా రచన నుంచి సినీ గీత రచనకు మరలిన నేటి యువగీత రచయిత భాస్కరభట్ల (రవికుమార్) ఇ.వి.వి. ద్వారా 'గొప్పింటి అల్లుడు' (2000) లాంటి చిత్రాల్లో తొలి అవకాశం అందుకున్నవారే. ఎంతో కాలంగా సంగీత శాఖలో పనిచేస్తున్న శ్రీనివాసమూర్తికి 'మా ఆవిడ మీదొట్టు, మీ ఆవిడ చాలా మంచిది' (2001) చిత్రంలో సంగీత దర్శకత్వ అవకాశమిచ్చారు. అలాగే, రచయిత – నటుడు స్వర్గీయ ఓంకార్ కుమారుడైన నిరుపమ్‌కు 'ఫిట్టింగ్ మాస్టర్' (2009) చిత్రంలో ప్రధాన విలన్‌గా వెండితెర అవకాశమిచ్చారు. అంతెందుకు! ఆయన దర్శకత్వం వహించిన ఆఖరి చిత్రం 'కత్తి కాంతారావు' (2010)తో గాయకుడు మల్లికార్జున్‌ను తాజాగా సంగీత దర్శకుడిగా పరిచయం చేశారు. ఆయన చిత్రం ద్వారా హాస్య నటులుగా (ఎల్బీ శ్రీరామ్ వగైరా), రచయితలుగా (జనార్దన మహర్షి తదితరులు) పేరుతెచ్చుకున్న వాళ్ళు ఎంతోమంది! ఇలా ఎందరికో అవకాశం ఇవ్వడమే కాకుండా, తనకు తొలినాళ్ళలో అవకాశమిచ్చిన 'నవత' కృష్ణంరాజు, దర్శకులు దేవదాస్ కనకాల, జంధ్యాల, రామానాయుళ్ళను ఎప్పుడూ స్మరించేవారు.

మజాకా' (1995)లోని కొన్ని సన్నివేశాల మీదైతే పెద్ద దుమారమే రేగింది. అయితే, దాన్ని కూడా సమర్థించుకొంటూ, ఈ వ్యాస రచయితతో ఆయన ఓసారి ఇలా అన్నారు. – "ప్రారంభ దశలో నేను ద్వంద్వార్థపు డైలాగులు వాడాను. ఆ తరువాత ట్రెండ్ మార్చుకున్నాను. అయినా, ఇవాళ సమాజంలో నూటికి 90 నుంచి 99 శాతం మంది బూతును ఆస్వాదిస్తారు. దానివల్ల సమాజం పాడైపోవడం ఏమీ ఉండదు. గ్రామీణ పాత్రలు బూతు లేకుండా మాట్లాడరు. మీరంటున్న 'సీతారత్నం గారి అబ్బాయి'ని చూసినవాళ్ళలో నూటికి 90 మంది మహిళలే! అయినా బూతు వల్లే విజయం సాధిస్తున్నానన్న విమర్శను తిప్పికొట్టడానికి కృషి చేస్తూ, 'ఆమె' (1994)తో ట్రెండ్ మార్చుకున్నా" అని ఇ.వి.వి. వివరించారు. చూడడానికి లావుగా, ఎత్తుగా, చామనఛాయలో సీరియస్ మనిషేమో అనిపిస్తారు కానీ, కదిలిస్తే ఇ.వి.వి. మాటల ప్రవాహమే. ఆయన ఎంత సరదాగా మాట్లాడతారో, అంత నిక్కచ్చిగానూ తన అభిప్రాయాలు చెబుతారు.

మంచితనమే మనిషి ధనం

చిన్న పల్లెటూరి నుంచి వచ్చి, పరిశ్రమలో ప్రముఖ దర్శకుడి స్థానానికి ఎదిగిన ఇ.వి.వి. చివరి వరకు తనలో ఆ పల్లెటూరి పచ్చదనాన్ని నిలుపుకొన్నారు. ఆప్యాయతనూ, కష్టాల్లో ఉన్నప్పుడు ఆదరించిన వాళ్ళ పట్ల కృతజ్ఞతనూ మర్చిపోలేదు. పత్రికా రచయితలను అవసరం కోసం కాక ఎదురుపడినప్పుడల్లా ఆప్యాయంగా పలకరించే అభిమానం, గౌరవం ఆయన సొంతం. దర్శకుడిగా తొలి చిత్రమే ('చెవిలో పువ్వు' – 1990) ఫ్లాపైనప్పటికీ, రెండో చిత్రానికి ('ప్రేమఖైదీ' – 1990) అవకాశమిచ్చి, తరువాతి రోజుల్లో తన కుమారులిద్దరూ (ఆర్యన్ రాజేష్, 'అల్లరి' నరేష్) హీరోలుగా నిలబడేందుకు కూడా తోడ్పాటునిచ్చిన నిర్మాత డి. రామానాయుడు అంటే ఆయనకు ఎనలేని కృతజ్ఞత. ఇ.వి.వి. తన ఇంటర్వ్యూలన్నిటిలో ప్రత్యేకంగా ఆ కృతజ్ఞతను వెల్లడించేవారు.

పెద్ద కుటుంబం బాధ్యతలు మోస్తూ, ఒకప్పుడు తినడానికి సరైన తిండి కూడా లేక కష్టపడిన ఇ.వి.వి.కి సాటి మనిషి కష్టాలు బాగా తెలుసు. ఆ గుండె తడి ఉంది కాబట్టే, ఎవరైనా కష్టాల్లో ఉన్నారంటే, వారికి చేతనైన సాయం చేయడంలోనూ ఆయన ఎప్పుడూ ముందుండేవారు. ఎవరైనా నటీనటులు ఇబ్బందులు పడుతూ ఉంటే, వారికి తన చిత్రాల్లో పాత్రలు సృష్టించి, పిలిచి మరీ అవకాశాలిచ్చిన ఆయన మంచితనం తెలుగు సినీ రంగంలో చాలామందికి తెలిసిన విషయం.

నిర్మాతల దర్శకుడు

అగ్ర హీరోలతో భారీ చిత్రాలు రూపొందించినా, చిన్న హీరోలతో సినిమాలు

తీసినా నిర్మాతల బాగునే నిరంతరం కాంక్షించిన దర్శకుడు ఇ.వి.వి. "నిర్మాత బాగుంటేనే, దర్శకుడు బాగుంటాడనీ, చిత్ర పరిశ్రమ బాగుంటుందనీ నమ్మిన 'నిర్మాతల దర్శకుడు' ఆయన. దర్శకుడు, హీరో ఏకమై, తమ ఇమేజ్ మోజులో నిర్మాత క్షేమాన్ని అవతలకు నెట్టేస్తున్న నేటి అవాంఛనీయ పరిస్థితుల్లో చెప్పిన బడ్జెట్‌లో, చెప్పిన రోజుల్లో సినిమాను పూర్తి చేస్తూ వచ్చిన ఏకైక దర్శకుడు ఇ.వి.వి. అంటే అతిశయోక్తి కాదు" అని మద్రాసు నాళ్ళ నుంచి ఇ.వి.వి.తో పరిచయం ఉన్న నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్ అభిప్రాయపడ్డారు.

నిజానికి, ఆయనకు గొంతు క్యాన్సర్ వ్యాధి వచ్చినట్లు చాలా నెలల క్రితమే వైద్యపరీక్షల్లో తేలింది. దానికి చికిత్స చేయించుకుంటూ వచ్చిన ఆయన వ్యాధి నుంచి కొంత తేరుకున్నట్లే కనిపించారు. క్యాన్సర్ వచ్చినట్లు తేలిన తరువాత కూడా ఆయన సినిమాలు మానలేదు. 'బెండు అప్పారావు' చిత్రం పూర్తి చేశారు. దర్శకుడిగా 50వ సినిమాగా 'బురిడి' (2010) చిత్రం తీశారు. తాజాగా తన 51వ సినిమాగా 'కత్తి కాంతారావు'ను సైతం రూపొందించారు. ఖరీదైన సిగరెట్లు ఆగకుండా కాల్చే అలవాటున్న ఇ.వి.వి. తన వ్యాధి విషయం బయటపడిన తరువాత కూడా ధూమపానాన్ని మానివేయలేకపోయారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన ఆయన ఆ పైన మూడు రోజులకే జనవరి 21 శుక్రవారం రాత్రి గుండె ఆగి మరణించడం పెను విషాదం. ఇ.వి.వి. మరణంతో తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని హాస్య నటీనటులకూ, హాస్య కథా చిత్రాల రచయితలకూ ఓ పెద్ద దిక్కు పోయినట్లయింది. నిత్య జీవితంలోని ఒత్తిళ్ళ నుంచి బయటపడేందుకు హాస్యరసభరిత చిత్రాలను ఆశ్రయించే ప్రేక్షకులకు సైతం ఇ.వి.వి. మరణం పెద్ద వెలితే! ఖాళీ అయిన ఆ స్థానం ఇప్పటికిప్పుడు భర్తీ అవుతుందా అన్నది సందేహమే! అయితే, అప్పటి దాకా, ఆ తరువాతా కూడా ఇ.వి.వి.ని ఎవరూ మర్చిపోరన్నది మాత్రం సందేహాలకు తావులేని అంశం!! ★



హరాభరా కట్లెట్

కావలసిన పదార్థాలు

బీన్స్ తురుము - 1 కప్పు, పచ్చి బఠాణీలు - 1 కప్పు
పాలకూర - నాలుగు కట్టలు, బంగాళ దుంపలు - 2
పనీర్ - 50 గ్రా, పచ్చిమిర్చి - 2
అల్లంవెల్లుల్లి - 1 టీ స్పూన్, కారం - పావు టీ స్పూన్
బ్రెడ్ పొడి - 1 కప్పు, ఉప్పు - తగినంత, నూనె - వేయించడానికి సరిపడా

తయారు చేసే విధానం

కూరగాయలన్నీ శుభ్రంగా కడిగి ముక్కలుగా కోసి ఉడికించాలి. బంగాళదుంపలు కూడా పొట్టు తీసి అందులోనే వేయాలి. తర్వాత నీళ్లు వంపి ముక్కల్ని మిక్సీ లో మెత్తగా చెయ్యాలి. అందులోనే పచ్చిమిర్చి, ఉప్పు, కారం, అల్లం వెల్లుల్లి వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని గుండ్రటి వడలుగా ఒత్తి బ్రెడ్‌పొడిలో ముంచి పెనం మీద రెండు వైపులా కాల్చాలి.



ఆలూ బఠాణీతో కట్లెట్

కావలసిన పదార్థాలు

బంగాళ దుంపలు (చిన్నవి) - పావు కిలో
బఠాణీలు (మెత్తగా ఉడికించినవి) - అరకప్పు
కొత్తిమీర తురుము - 2 టేబుల్ స్పూన్లు
గరం మసాలా - 1 టీ స్పూన్
మిరియాల పొడి - చిటికెడు
ఉప్పు - తగినంత
నూనె / నెయ్యి - వేయించడానికి సరిపడా

తయారు చేసే విధానం

ఉడికించి పొట్టు తీసిన బంగాళదుంపల్ని చిదిమి మెత్తగా చేయాలి. ఉడికించిన బఠాణీలని అందులో వేసి కలపాలి. కొత్తిమీర, మసాలా పొడి, ఉప్పు కూడా వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చిన్న ముద్దలుగా చేసుకుని బిళ్లల్లా వత్తుకోవాలి. పెనం మీద కొద్దగా నెయ్యి లేదా నూనె రాస్తూ వీటిని దోరగా వేయించాలి.

మటన్ చాప్స్

కావలసిన పదార్థాలు

మటన్ చాప్స్ - 6
నెయ్యి - 4 స్పూన్లు
అల్లం వెల్లుల్లి - 2 స్పూన్లు
పచ్చిమిర్చి పేస్ట్ - 2 స్పూన్లు
నిమ్మరసం - 3 స్పూన్లు
గరం మసాలా - 1 స్పూన్
వేయించిన జీలకర్ర పొడి - 1 స్పూన్
పెరుగు - 2 టేబుల్ స్పూన్లు
ఉప్పు - రుచికి సరిపడా

తయారు చేసే పద్ధతి

మటన్ చాప్స్‌కి అల్లంవెల్లుల్లి పేస్ట్, నిమ్మరసం, పచ్చిమిర్చి పేస్ట్, జీలకర్ర పొడి, పెరుగు, ఉప్పు పట్టించి పావుగంట నానబెట్టాలి. తర్వాత కుక్కర్‌లో పెట్టి పది నిమిషాలు ఉడకబెట్టాలి. వీటిని తీసి చల్లారనివ్వాలి. పెనంమీద నెయ్యి రాసి సన్నని సెగమీద బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. వీటిని వేడిగా తింటే చాలా రుచిగా వుంటాయి.



మటన్ కట్లెట్



కావలసిన పదార్థాలు

ఎముకలు లేని మాంసం - పావుకిలో
పాలు - అరకప్పు ,
కోడిగుడ్లు - 2 (తెల్లసొన మాత్రమే)
వెల్లుల్లి - 4 రెబ్బలు
అల్లం - అంగుళం ముక్క
పచ్చిమిర్చి - 2
కొత్తిమీర తురుము - 2 టేబుల్ స్పూన్లు
జీలకర్రపొడి - 1 టీ స్పూన్
బ్రెడ్ పొడి - 2 కప్పులు
లవంగాలు - 2, దాల్చినచెక్క - అంగుళం ముక్క
యాలకులు - 2
నెయ్యి లేదా నూనె - వేయించడానికి సరిపడా

తయారు చేసే విధానం

మాంసం ముక్కల్లో అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి, కొత్తిమీర తురుము, జీలకర్ర పొడి, లవంగాలు, దాల్చినచెక్క వేసి ఉడికించాలి. అవసరాన్ని బట్టి కొద్దిగా నీళ్లు పోసుకోవచ్చు. సన్న సెగమీద పెట్టి నీళ్లన్నీ ఇంకిపోయేవరకు మెత్తగా ఉడికించాలి. దీన్ని స్టౌ మీది నుండి దించి ఆరాక మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చెయ్యాలి. ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న వడల్లాగా చేయాలి. వీటిని కోడిగుడ్డు తెల్లసొనలో ముంచి తర్వాత బ్రెడ్ పొడిలో ముంచాలి. ఆ తర్వాత నూనెలో దోరగా వేయిస్తే చాలు. వీటిని పొదినా చట్నీలో తింటే చాలా రుచిగా వుంటాయి.

సీరియల్

జరిగినకథ:

భిహువా జైలుకు వెళ్లిన కుయేన్‌కు ఆ విషాదకర వార్త తెలుస్తుంది. ట్రాయ్‌ను ఉరితీసేందుకు అధికారులు సిద్ధమౌతున్నారన్నదే ఆ వార్త. అందుకోసమే పీనుగుల పెట్టెను కూడా సిద్ధం చేస్తారు. అయితే ఆమెను అధికారులు లోపలికి వెళ్లనివ్వరు. తన భర్తను చంపేదెందుకని గేటు ఊచలు పట్టుకుని ఊపుతూ గట్టిగా కోపంగా అరుస్తుందామె. ఓ సిపాయి వచ్చి ఆమెను అక్కడినుంచి పక్కకు విసిరేస్తాడు. మరో సిపాయి వచ్చి గేటును తెరవకుండా గట్టిగా పట్టుకుంటాడు. అక్కడున్నవారంతా అలా చూస్తుండడం మినహా ఏమీ చేయలేని నిస్సహాయత నెలకొంటుంది. ఆఖరుకు ట్రాయ్ వకీలుకు కూడా విషయం తెలియకముందే ఉరితీత అయిపోతుంది. కనీసం శవాన్ని తెచ్చుకోడానికైనా ప్రయత్నిస్తారు. మరుసటిరోజు పత్రికల్లో వార్త వచ్చాకగానీ వారికి ట్రాయ్‌ను పాతిపెట్టిన ప్రదేశం ఎక్కడో తెలీలా. కుటుంబికులు అంతా అక్కడికి వెళతారు. ఒక చిన్న రాయిమీద ట్రాయ్ పేరు చెక్కించుకొని తీసుకెళతారు. పోలీసులు వీరికోసం ఎదురుచూస్తుంటారు. సమాధి చూడ్డానికి వచ్చినవారి ఫొటోలు తీస్తారు.

వియత్నాం వీరుడు ఎన్‌గుయెన్ వాన్‌ట్రాయ్

(ఇరవయ్యో భాగం)

కథనం: ఫాన్-థి-కుయేన్

అనువాదం: పాటూరి రామయ్య

ఈ విషాదపూరితమైన వార్తను మా కుటుంబంలోని వారందరికన్నా చిట్టచివర తెలుసుకున్నది మా అమ్మ. సరుకులమ్ముకునేందుకు బిన్‌లాంగ్, బిన్ హూవాలకు వెళ్ళి వున్నందువల్ల ఇలా జరిగింది.

ఆమె ఇంటికి తిరిగి వచ్చే రోజున ట్రాయ్‌కి తీసుకెళ్ళేందుకు మాంసం, పండ్లు కొనక్కుని తెచ్చేది. గుమ్మంలో అడుగుపెట్టీ పెట్టకముందే నా చిట్టి చెల్లి క్యాన్ ఆశనిపాతంలాంటి ఈ వార్తను మా అమ్మకు చెప్పింది.

'అమ్మా! వాళ్ళు టూ సోదరుణ్ని కాల్చి చంపారే!' అన్నది క్యాన్.

మా అమ్మ దుఃఖావేశంతో ఉడికిపోయింది.

నేల అదిరిపోయేట్లు కిందపడి పొర్లాడుతూ బిగ్గరగా అరుస్తూ ఏడ్చింది. అమెరికా దురాక్రమణదారులను, ఖాన్ ముఠాను ఆమె నోటికి వచ్చినట్లు తిట్టిపోసింది : ఇరుగు పొరుగు వాళ్ళంతా వచ్చి చేరారు. మా కుటుంబం మీద నిఘా కోసం నియమింపబడ్డ పోలీసు గూఢచారులు వాకిలికి దగ్గరలో కనబడ్డారు. ఇలా వాళ్లను తిడుతూ వుంటే రాబోవు ఆపదలు గ్రహించి మా నాన్నగారు ఆమెను ఓదార్చడానికి ప్రయత్నించాడు.

'పెద్దగా ఎందుకు ఏడ్వటం? నీవు టూని ఎలా ప్రేమతో చూస్తూండేదానివో చిన్నగానే తలపోసుకో.'

మా నాన్న ఎంత చెప్పినా అమ్మ వినిపించుకోలేదు.

'నువ్వు ట్రాయ్‌ని ఎలా ప్రేమించినా నీ దారి వేరు. నా అభిమానం నాది. నేను పెద్దగానే ఏడుస్తాను. అతణ్ని చంపిన దుర్మార్గులను నా ఇష్టమొచ్చినట్లు తిట్టిపోస్తాను. వాళ్ళు వచ్చి నన్ను చంపినా సరే నాకేం భయంలేదు. ట్రాయ్ నాకు ఘనమైన అల్లుడు. అలాంటి వాణ్ణి మళ్ళీ ఎలా సంపాదించుకోగలను?'

అమ్మ ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది. ఆమె మంచం పట్టేస్థితిలో ఉంది. ఖాన్ హూయ్ నుండి పూన్ హూవాకు వెళ్ళింది. అక్కడ ట్రాయ్ ఫొటో కనపడితే చాలు ఆమె దుఃఖించి అలమటించి పోయేది. ఒంట్లో ఒక పక్క 'బ్రే' ఉన్నచోట మూడుచారల జండా ఒకటి వేలాడుతూ ఉండేది. అది కీలుబొమ్మ ప్రభుత్వ జండా. మా అమ్మ ఒక్క ఉదుటున కిందికి లాగేసింది. పేలికలు పేలికలుగా చించి పారేసింది. కిందికి విసిరికొట్టి తొక్కివేసింది.

ఉత్తరాది ఆచారం ప్రకారం ట్రాయ్ స్మృత్యర్థం కోసం ఏడువారాలు కర్మకాండ జరపాలి. ఇలా జరిపేందుకు ఖాన్ హూయ్‌లో గుడి దగ్గర ఏర్పాటు చేసింది మా అమ్మ.

కర్మకాండ మొదటివారం ప్రారంభమైంది. గుడిలోని పూజారులు ఒక నోటీసు బోర్డును గుడి వెలుపల గోడకు తగిలించి పెట్టారు. ఆ నోటీసులో ఇలా వుంది :

'ఎన్ గుయెన్ వాన్ ట్రాయ్ స్మృత్యర్థం 22.10.1964 తేదీ సాయంత్రం 7 గం॥ నుండి కర్మకాండ జరుగును. బౌద్ధులందరూ హాజరు కమ్మని కోరుచున్నాం.'

కీలుబొమ్మ ప్రభుత్వ గూఢచారులు ఈ కార్యక్రమం పూర్తి అయ్యేవరకు గట్టి నిఘా పెట్టి ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎవ్వరూ ధైర్యం చెయ్యలేరని నేను భయపడ్డాను. నేను ఇంతకుముందు చూసిన కర్మల కంటే ఇప్పుడు విరివిగా జనం వచ్చారు. వాళ్ళంతా పువ్వులూ, ధూపదీపాలు తెచ్చారు. గుడిలో జరుగుతున్న ఈ కార్యక్రమం నా హృదయానికెంతో ఊరట కలిగించింది.

ట్రాయ్‌ని చంపిన ఖూనీకోర్లను, అమెరికా ఖాన్ రాక్షస ముఠాను తీవ్రంగా ఖండిస్తూ సైగాన్ ప్రజలు కరపత్రాలు వేయించి పంచిపెట్టారు. ఆ కరపత్రాల్లో ట్రాయ్ ధైర్యసాహసాలను శ్లాఘించారు.

రాత్రింబవళ్ళు కిక్కిరిసిపోయే జనసమ్మర్దంగల ప్రాంతం బియెన్‌హూ ఆటోబాన్. ఆ ప్రాంతానికి కుడివైపుగా ఒక పెద్ద జండా ఎగురుతున్నదని ఒక లారీ డ్రైవరు నాతో చెప్పాడు. అతడు నేను పనిచేస్తున్న ఫ్యాక్టరీలోనే పత్తిబేళ్ల రవాణాలో నౌకరీ చేస్తుండేవాడు. ఆ జండా మీద ఇలా రాసి వుందని చెప్పాడు :

1964 అక్టోబరు 16వ తేదీ పత్రికల్లో ట్రాయ్‌ను ఉరితీసిన ఫొటోలు పడ్డాయి. ఆ

ఫోటోలను ఖాదారులు ఎప్పుడు కోరితే అప్పుడు చూసుకునేందుకు వీలుగా హోటళ్ళు, సారా అంగళ్ళు, విశ్రాంతి భవనాల యజమానులు భద్రంగా ఉంచారు. ఆనాటి ఉదయం బెన్‌థాన్ మార్కెట్టులో వ్యాపారమంతా బంద్ అయిపోయింది. అక్కడ ఏ మూల చూచిన విషాదఛాయలు అలముకున్నాయి. ఆ మార్కెట్టు వద్దకు పోలీసు సూపరింటెండెంటు వచ్చి ఆశ్చర్యంతో ఇలా అరిచాడని నా దత్తు తల్లి శ్రీమతి ఎం. నాతో చెప్పింది.

'ఏమిటీ! ఈ వియత్కాంగ్ పట్ల ఇంతటి గౌరవ సూచకమా!'

ఆ సాయంత్రం పోలీసులు చూస్తుండగానే ముందు సంభవించబోయే ప్రమాదాలను లెక్కచేయకుండానే అత్యధిక ప్రజలు గుడిదగ్గరకు వచ్చారు. వారి సంతాపం తెలియజేశారు. కన్నీళ్ళు తుడుచుకుంటూ నా వద్దకు వచ్చి అనేక ప్రశ్నలడిగారు.

మీ వివాహమై ఎంతకాలమైంది? నువ్వు ఏం పనిచేసే దానవు? ట్రాయ్ స్వగ్రామమెక్కడ?

ఒక పెద్దామె ఇలా అన్నది !

'ఈ సాహస వీరుణ్ని కన్న తల్లిదండ్రులు ఎంతటి ధన్యులు!'

బాధను వ్యక్తం చేస్తూ ఇలా చెప్పింది.

'దేశం కోసం నీ భర్త ప్రాణాలర్పించాడు. అతని త్యాగం నీకు చాలా దుఃఖం కలిగించింది. పోలీసుల దాడి నుండి తప్పించుకునేందుకు కొంతకాలం మా ఇంట్లోనే మాలో ఒకరిగా ఉండు. బాగా ఆలోచిస్తావని తలుస్తున్నాను.'

నేనిలా అన్నాను.

'పోలీసులను చూచి భయపడి ఈ కర్మ కాండకు ఎవ్వరూ రారని నేను భావించాను. అయినప్పటికీ మా మీద దయతో మీరు వచ్చారు.'

'అవును! ఇక్కడకు రావడానికి ధైర్యం చాలక కొంతమంది వాళ్ల ఇళ్లలోనే ట్రాయ్ స్మృత్యర్థం ఏవో కార్యక్రమాలు జరుపుకొంటున్నారు'.

'నేను, నా స్నేహితులం ఇలా అనుకున్నాం :

'కాల్చి చంపుతున్నప్పుడు కూడా వీరోచిత సాహసం ప్రదర్శించాడు. అలాంటి ట్రాయ్ జ్ఞాపకార్థం జరుగుతోన్న కర్మకాండకు హాజరు కావడానికి భయపడి వెనకడుగు వేయడమా!'

నేను 'కే' సోదరిని కూడా కలుసుకున్నాను. కొన్ని రోజుల కిందట ఆమె ఇలా అన్నది సంతోషంగా.

'ట్రాయ్ విడుదలైనప్పుడు జరిగే స్వాగతోత్సవానికి నన్నాహ్వానించడం మరచిపోవద్దు సుమా!'

కానీ ఇప్పుడామె ఇలా అన్నది.

'మీరు జరుపుతోన్న కర్మ విషయం మధ్యాహ్నం భోజనం అయిన తర్వాతనే విన్నాను. పువ్వులూ, ధూపదీపాలు తేవడానికి వ్యవధి లేదు... విముక్తి సంఘటన రేడియో, హానోయ్ రేడియో విన్నావా?

'నాకు రేడియో సెట్టు లేదు కదా! ఒకవేళ ఉండినా ఆ కేంద్రాల నుండి వినడానికి వీలు కలిగేది కాదు. ఎందువల్లనంటే పోలీసు గట్టి నిఘా పెట్టి కాపలా కాస్తున్నారు.'

'దక్షిణ వియత్నాం వీరుడు' బిరుదును పితృభూమిని శిల్పించిన కంచు మోడల్‌నూ ట్రాయ్‌కి బహూకరించినట్లు ఈ రెండు కేంద్రాల నుంచీ రేడియోలు ప్రసారం చేశాయి. ఈ 20 సంవత్సరాల ప్రతిఘటనోద్యమంలో ఇలాంటి గొప్ప అవార్డులు ఎవరూ పొంది వుండలేదు. ఇదొక్కటిచాలు నీ మనస్సుకి శాంతినీ, ఊరటనూ కలిగించడానికి. ట్రాయ్ జీవిత విశేషాలు ఆయన చేసిన సాహసకృత్యాలు, విమోచనా సంఘటన ఆయనకిచ్చిన అవార్డుల గురించి తెలియజేసే ఒక చిన్న పుస్తకాన్ని చదివాను. ఈ పుస్తకాలు పట్టణ ప్రజలకు పంచి పెట్టారు.'

గుడిలో ఒక మూల ప్రజలు వచ్చి నా చుట్టూ చేరారు. ఆయన్ను ఉరితీసే ముందుగా నేను చూడ్డానికి ప్రభుత్వం ఎలా నిరోధించిందీ, చివరికి ఆయన శవాన్ని కూడా నాకు అప్పగించడానికి వ్యతిరేకించిన విషయమూ వాళ్ళకు వివరించాను. ఆయన్ను కాల్చి చంపిన వివరాలను సూగాన్ ప్రజలు పత్రికలలో చూసి తెలుసుకున్నారు. నా భర్తకు, వారి కుటుంబానికి ప్రభుత్వం ఎలా బాధలూ, కష్టాలు కలిగించిందీ వాళ్ళు ఇప్పుడే విన్నారు. చింతతోనూ, ఆశ్చర్యంతోనూ వాళ్ళు ఒకరి కొకరు మాట్లాడుకోవడం విన్నాను. చాలామంది గేటు పక్కకు వెళ్ళి భోరున ఏడ్చారు.

నాలుగో వారంలో ట్రాయ్ స్వగ్రామమైన క్వాంగ్‌నామ్ వెళ్లాను. నేను ఆయన స్వగ్రామం చూడ్డం ఇదే మొదటిసారి. అక్కడ నుండి తిరిగి రాబోయేముందు ట్రాయ్ కర్మ సందర్భంగా ఇంకా మిగిలివున్న కార్యక్రమాల్లో పాల్గొనవలసిందిగా వారినందరినీ కోరాను. పని ఒత్తిడివల్ల ముందుగా వచ్చి తెలియజేయలేక పోయానని వారితో చెప్పుకున్నాను.

వాళ్ళు నాతో ఇలా అన్నారు :

'నీకు ఎక్కడ ఇష్టమైతే అక్కడ ఉండవచ్చు. దేశ ప్రజల కోసం తన ప్రాణాలను తృణపాయంగా బలిచ్చాడు ట్రాయ్. అతని కుటుంబాన్ని కాపాడ్డం తన దేశస్థులుగా మా విధి. నీ భర్త స్మృత్యర్థం జరుగుతున్న కర్మకాండ మాకందరికీ సంబంధించింది. ఎలాగైనా ఆయన ఫొటోలు మాకు చేర్చండి. ప్రతి పౌర్ణమి రోజున, ప్రతి శుద్ధ విదియ నాడు ట్రాయ్‌కి సాంబ్రాణి వేసి ధూపదీపాలు వెలిగిస్తాం. ఇది మా సంప్రదాయం."

కర్మాకాండ చివరి వారానికల్లా నేను సైగాన్‌కు చేరాను. తొలిరోజుల కంటే ఇప్పుడు అత్యధికంగా ప్రజలు హాజరయ్యారు. ట్రాయ్ స్వగ్రామంలోని విశేషాలు అడిగారు అక్కడ చేరిన జనం. విమోచన సంఘటన కార్యకర్తలు నన్ను చూడ్డానికి వచ్చి నాతో మాట్లాడిన విషయాలన్నిటినీ తెలిపారు. పగతీర్చుకోవాలన్న పట్టుదలతో అనేకమంది శత్రు సైనికులను వారు మట్టుపెట్టారు. ట్రాయ్ ధైర్య సాహసాలను వాళ్ళు ఆదర్శంగా స్వీకరిస్తున్నారు.

ఆయన విప్లవ చర్యల్ని కొనియాడుతూ పాటలు పాడారు. ఆయన కుటుంబ సభ్యులమైన మమ్మల్ని విప్లవంలో చేరి పోరాడేందుకు ట్రాయ్ పేరు ప్రతిష్టలు నిలబెట్టేందుకు ప్రోత్సహించారు. విమోచనా సంఘటన గౌరవనీయమైన 'అవార్డును' పొందిన దక్షిణ వియత్నాం వీరుడని శ్లాఘించారు.

ఆనాటి రాత్రి ఆలస్యంగా గుడి దగ్గర నుండి వస్తున్నప్పుడు ఓ చిన్నపిల్ల ఒక సందేశం తీసుకొచ్చింది, ఆ సందేశం 'ఎక్స్' సోదరి పంపింది. ఇది నాకు చాలా సంతోషం కలిగించింది. ఆమె జైలు నుంచి తప్పించుకొని వచ్చినప్పటి నుండి సైగాన్‌లోనే ఉంటుంది. కాని అత్యవసర సమయాల్లో సహాయం కోరేందుకు ఆమెను కలుసుకోవడం చాలా కష్టతరమయింది.

నేను ఇంటికి వెళ్ళి జాగ్రత్తగా తలుపులు మూసివేశాను. దీపం వెలిగించాను. ఆమె పంపిన సందేశం చదవడం ప్రారంభించాను.

'నేను వచ్చి నీ దుఃఖసాగరంలో పాలుపంచుకోలేక పోతున్నందుకు విచారిస్తున్నాను. దుఃఖంతోబాటు సగర్వం, అతిశయంతో నీ హృదయం నిండి ఉంటుందని నాకు తెలుసు. మా కామ్రేడ్ ట్రాయ్ మాకు గర్వకారణం. ఆయన చేసిన త్యాగం మన దేశానికి, ప్రపంచానికంతకూ గర్వకారణం....

(ఇంకావుంది)

ఆనాటి రాత్రి ఆలస్యంగా గుడి దగ్గర నుండి వస్తున్నప్పుడు ఒక చిన్నపిల్ల ఒక సందేశం తీసుకొచ్చింది, ఆ సందేశం 'ఎక్స్' సోదరి పంపింది. ఇది నాకు చాలా సంతోషం కలిగించింది. ఆమె జైలు నుంచి తప్పించుకొని వచ్చినప్పటి నుండి సైగాన్‌లోనే ఉంటుంది. కాని అత్యవసర సమయాల్లో సహాయం కోరేందుకు ఆమెను కలుసుకోవడం చాలా కష్టతరమయింది.

నేను ఇంటికి వెళ్ళి జాగ్రత్తగా తలుపులు మూసివేశాను. దీపం వెలిగించాను. ఆమె పంపిన సందేశం చదవడం ప్రారంభించాను.



నవ్వుల్ - పువ్వుల్

బలగం

పేరయ్య : అమ్మాయిది బాగా బలగం ఉన్న కుటుంబం. ఈ సంబంధం కాదనకండి.

రామనాథం : ఏ విషయంలో బలగం ఉందండి?

పేరయ్య : అమ్మాయికి అబ్బాయితో ఏమయినా గొడవలొస్తే కాలో, చెయ్యో తియ్యగలిగేంత బలగం.

నాన్నకు చెబితే...

మాస్టారు :ఏరా ప్రకాష్! మూడులో నుండి ఆరు తీయగలమా?

ప్రకాష్: ఎందుకు తీయలేం సార్! మా నాన్నతో చెబితే ఎవర్నైనా పంపించి బలవంతంగా ఎన్నైనా సరే తీయిస్తాడు.

ఇప్పుడు మీవే

(బస్టాండ్‌లో ఓ పెద్దమనిషి రెండు చేతులతో రెండు సూట్‌కేసులను భారంగా మోసుకెళుతుంటాడు)

ప్యాసెంజర్: ఏవండీ టైమెంతైందండీ?

(పెద్దమనిషి రెండు సూట్‌కేసులనూ కింద పెట్టి...వాచీకున్న చిన్న బటన్ నొక్కి మిన్నూ టైమెంత? అంటాడు. అది నవ్వుతూ టైమ్ చెప్తుంది.)

ప్యాసెంజర్: వావ్. వాచీ చాలా బావుందండీ. నేనూ కొనుక్కుంటాను. అడ్రస్ చెప్తారా?

పెద్దమనిషి: దీనికే ఇలా మనసు పారేసుకుంటే ఎలా? ఇందులో కావాలంటే టీవీ కూడా చూడొచ్చు.

ప్యాసెంజర్: ఔనా! మరైతే నాకు ఈ వాచీ ఇప్పుడే కావాలండీ. మీరే మళ్లీ మరో వాచీ కొనుక్కోండి. ఖరీదు ఎంతో చెప్పండి?

(పెద్దమనిషి ధర చెప్పి అతనిచ్చిన డబ్బు తీసుకొని, వాచీ అతని చేతిలో పెట్టి వెళ్లిపోతుంటాడు)

ప్యాసెంజర్: సార్ మీరు మీ సూట్కేసులు మర్చిపోయారు!

పెద్దమనిషి: ఇక నుంచి అవి మీవే. ఆ రెండూ మీ వెంట వుంటే తప్ప మీ చిన్ని వాచీ పనిచేయదు.

టైమ్



మాస్టారు : టైమ్ వేస్ట్ చెయ్యకూడదు

స్టూడెంట్ : అయితే దేన్లో పెట్టి దాయమంటారు సార్.

ఇంటర్వ్యూ

(ఒకతను పోలీసు ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకి వెళతాడు)

ఇంటర్వ్యూ చేసే వ్యక్తి: గాంధీని చంపింది ఎవరు?

రెండవ వ్యక్తి: థ్యాంక్యూ సార్. నాకు ఈ ఉద్యోగం ఇచ్చినందుకు. ఇప్పుడే గాంధీని చంపిందెవరో పరిశోధన మొదలెడతాను!

రివిజన్

తల్లి: ఏరా చింటూ! స్కూల్లో చేసిన వర్క్ రివిజన్ చేసుకోరాదూ. ఖాళీగా వుండకపోతే...

చింటూ: ....

తల్లి: ఏంట్రా... అలా చేతులు రెండూ పైకెత్తి నిలబడిపోయావ్?

చింటూ: మరి నేను స్కూల్లో చేసిన పని ఇదేనమ్మా...

పనైపోయింది

(తండ్రి ఆరాంగా కుర్చీలో కూర్చుని పేపర్ చదువుకుంటుంటాడు)

పిల్లవాడు: నాన్నా! ఇదిగో నీ తుపాకీ.

తండ్రి: నువ్వెందుకు తీసుకెళ్లావ్‌రా.. భడవా?

పిల్లవాడు: స్కూల్లో చిన్న పనిబడితే తీసుకెళ్లా. ఇప్పుడంతా ఓకే అయ్యిందిలే.

బుద్ధి



సునీల్ : నీ కసలు బుద్ధి లేదురా....

సుధాకర్ : అదే ఉంటే నీతో ఎందుకు మాట్లాడతాను.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్

ఈత ఇలా కూడా...!



కాళ్లు, చేతులూ కట్టేసి నీళ్లలోకి తోస్తే ఎవరైనా ఈదగలరా! అసాధ్యం. కానీ సాధ్యమే అంటున్నాడీ చైనా వాసి విల్ సన్ యాంగ్‌డింగ్. ఈయనగారికి 47 సంవత్సరాలు. ఏదైనా వెరైటీగా చేయాలన్నది ఆయన పాలసీ. అందుకు నిదర్శనమే ప్రస్తుతం చేస్తున్న ఫీట్. ఫొటో చూశారుగా. తన నేస్తంతో కాళ్లు, చేతులూ కట్టేయించుకొని ఎలా నీళ్లలోకి దూకుతున్నాడో. ప్రస్తుతానికి జియాంగ్‌సూ ప్రావిన్స్‌లో కింగ్‌హువాయ్ నదిలో రోజూ ఇలాగే ఈత సాధన చేస్తున్నాడు. ఇలా2001 నుంచి జరుగుతోంది. అంటే పదేళ్లగానన్నమాట. మొదట కాళ్లు కట్టేసుకొని, తర్వాత చేతులు కట్టేసుకొని ఈదడం నేర్చుకున్నాడు. ప్రస్తుతానికి అవి రెండూ కట్టేసుకొని ఈత కొట్టేస్తున్నాడు. పది నిముషాల్లో 500 మీటర్ల దూరం ఈదగలుగుతున్నాడు. ఇలా గిన్నిస్ రికార్డు సృష్టించాలన్నది యాంగ్‌డింగ్ కోరిక. ఆయనంటే ఏదో సాధనమీద చేస్తున్నాడుగానీ...ఇలా ఎవరైనా నీళ్లలోకి దూకితే ఇంతే సంగతులు. తస్మాత్ జాగ్రత్త.

'పాల్' సీసాల మ్యూజియమ్

వింతలు, విడ్డూరాలకు మానవుడి పుర్రె పుట్టినిల్లు అనడానికిది మరో ఉదాహరణ. చూడండి. ఈ బొమ్మలో కనిపించే వ్యక్తి పేరు పాల్ ల్యూక్. వయసు 33. ఈయనగారికి ఓ హాబీ వుంది. అదేమంటారా! పాల సీసాలు సేకరించే అలవాటు. ఈ పని 1987 నుంచి చేస్తున్నాడు. ఇప్పటికి మొత్తం 10,000 సీసాలు సేకరించాడు. వాటిని భద్రపరచడానికి ఇల్లు కూడా చాల్లేదు. ఏం చేయాలా? అని ఆలోచించాడు. అప్పుడు పాలసీసాలతోనే ఒక మ్యూజియమ్ కట్టొచ్చు కదా అనిపించింది. అంతే...ఇంటివెనక తోటనే ఎంచుకొని కట్టేశాడు. ఇదిగో అందులో వరుసగా ఇలా పాల సీసాలను పేర్చేశాడు. అన్నట్టు ఈయనగారు తొలత పాలవాడు. 'ఓ... అందుకేనా! ఈ హాబీ అబ్బింది' అనిపిస్తుంది ఎవరికైనా. స్టాండ్‌ఫోర్డ్ లి హెూప్‌లో నివసించే ల్యూక్‌కు ఈ విషయంలో భార్యా, పిల్లల సహాయసహకారాలు ఎంతగానో వున్నాయనుకోండి. అన్నట్టు ఈయన ప్రస్తుతం చేసేది కూడా డైరీ లోనే. అదీ సేల్స్ రిప్‌గా. మొత్తం మీద ల్యూక్ సేకరించిన పాల సీసాలవైపు ఓ లుక్ వేశామంటే... పాల డైరీ చరిత్రంతా కళ్ల ముందు తిరుగుతుంది.

తెలుసా!

నోరూరించే కట్టడాలు



చేతిలో నైపుణ్యం వుండాలేగానీ...వస్తువును దానంతటదే వెతుకుతుంది. చాక్పీస్, బియ్యం, బొగ్గు, కూరగాయలు, బిస్కట్లు... ఏదైనా సరే,.... అద్భుత కళాఖండాలను సృజిస్తుంటారు. మిర్కో డెల్లా విచియ అద్భుతమైన చారిత్రక కట్టడాలను తయారుచేస్తుంటాడు. అదీ వైట్ చాక్లెట్లతో. ఇటలీలోని పీసా టవర్, కొల్లోజియమ్, ఈజిప్షియన్ ఆలయాలు, ఇంగ్లండ్ రాతి స్థూపాలు, గ్రీస్ పార్థినాన్... ఇలా ఎన్నింటినో రూపొందించాడు. వాటితో హాంగ్‌కాంగ్‌లో 'చాక్లెట్ వరల్డ్ హెరిటేజ్' ఎగ్జిబిషన్ కూడా పెట్టాడు. అయితే వీటిని తయారుచేయాలంటే...చాలా ఓర్పు, సహనం కావాలి. అందుకు తగినంత సమయాన్ని వెచ్చించగలగాలి. అవన్నీ మిర్కో దగ్గర చాలినంతగా వున్నాయి. అయితే సందర్శకులు మాత్రం చాక్లెట్ కట్టడాలను చూచి నాలుక తడుపుకోవాల్సిందే. అంతగా నోరూరిస్తుంటాయి. అన్నట్టు ఈయన ఇటీవల ప్రపంచంలోకెల్లా అతి పెద్ద చాక్లెట్ కట్టడం నిర్మించి గిన్నిస్ పుస్తకంలోకి ఎక్కేశాడు.

చూద్దామా

భారతదేశంలో అందమైన కొండలు, లోయలు, దట్టమైన అడవులు, జలపాతాలు చాలానే ఉన్నాయి. అయితే వీటన్నింటిలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన ప్రాంతం ఒకటుంది. మంచు కొండలు, సరస్సులు, ఉద్యానవనాలతో పర్యాటకులకు భూతల స్వర్గాన్ని తలపించేది, అద్భుతమైన అనుభూతిని మిగిల్చేది కాశ్మీర్ లోయ. పర్యాటకులు తప్పక చూడాల్సిన ప్రదేశంగా కాశ్మీర్‌ను చెప్పుకోవచ్చు.

-కె. నాగలక్ష్మి

మంచు దుప్పటి



కాశ్మీర్‌లోని దేవదారు వృక్షాలు

మన దేశ సరిహద్దుగా ఉన్న హిమాలయ పర్వతాల మధ్యనున్న కాశ్మీర్‌లోయలో ప్రయాణం మర్చిపోలేని జ్ఞాపకంగా మిగిలిపోతుంది. లోయలోకి ప్రవేశిస్తుండగా దట్టమైన అడవులు... అందులో రకరకాల వృక్షజాతులు... వీటి చుట్టూ మంచు పర్వతాలు... గలగలపారే సెలయేర్లు... నదీప్రవాహాలు... ఇలా పర్యాటకులను ఆకర్షించే అంశాల జాబితా చాలానే ఉంది.

కాశ్మీర్ రాష్ట్రం లడక్, జమ్ము, కాశ్మీర్ అనే మూడు ప్రాంతాలుగా విభజింపబడి 22 జిల్లాలతో కూడినది. వ్యవసాయం ప్రధానంగా ఉన్న ఈ ప్రాంతంలో 80 శాతం ప్రజలు దీని పైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఒక హెక్టారుకు 40 క్వింటాళ్ల పంట పండుతుంది. అంటే దేశంలోనే అత్యధిక దిగుబడి ఇక్కడుంది. వరి, గోధుమ, బార్లీ, బీన్స్, బీట్‌రూట్, క్యాలీఫ్లవర్, క్యాబేజీ మొదలైనవి ఇక్కడ విస్తారంగా పండుతాయి. జమ్ములో 66 శాతం హిందువులు, 34 శాతం ముస్లిములు నివసిస్తున్నారు. కాశ్మీర్‌లో 95 శాతం మంది ముస్లిములు, 5 శాతం మంది హిందువులు నివసిస్తున్నారు. లడక్‌లో బౌద్ధులు ఎక్కువగా కనిపిస్తారు.

తోటలు... నదులు...

యాపిల్, అక్రుట్, కుంకుమ పువ్వు, స్ట్రాబెర్రీ తోటలు ఇక్కడ ఎక్కువగా కనిపిస్తాయి. జీలం, చీనాబ్ నదుల్లోని నీరు ఇక్కడి ప్రజలకు జీవనాధారం. ఈ నదుల్లోని నీరు చాలా స్వచ్ఛంగా, రుచిగా వుంటుంది. అందుకేనేమో పండిట్ జవహర్ లాల్ నెహ్రూకి తాగడానికి, ఇంటి అవసరాలకు ఈ నీటినే సరఫరా చేసే వారట. భారతదేశంలో అతిపెద్ద మంచినీటి సరస్సు అయిన ఊలార్ సరస్సు (20 కిమీ/8 కిమీ) ఇక్కడ ప్రవహిస్తుంది.

పహిల్గావ్ పర్వత ప్రాంతం

లిడ్డర్, శేష్‌నాగ్ సరస్సుల మధ్య 2130 మీటర్ల ఎత్తులో ఉన్న పహిల్గావ్ పర్వత ప్రాంతం పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంది. అనంతనాగ్ జిల్లాలోని ఎత్తైన పర్వతాల మధ్య విశాలమైన మైదాన ప్రాంతాలు ఉన్నాయి. స్థానికులు ఈ ప్రాంతాన్ని మినీ కాశ్మీర్‌గా వర్ణిస్తారు. ఒకప్పుడు మొఘల్ చక్రవర్తులు పరిపాలించిన ఈ ప్రాంతం స్వాతంత్ర్యం తర్వాత భారతదేశంలో కలిసింది. అప్పుడు ఈ ప్రాంతంలో గొర్రెల పెంపకం ఎక్కువగా ఉండేది. చుట్టూ దట్టమైన చెట్లతో కూడిన అటవీ ప్రాంతం, మధ్యలో విశాలమైన పచ్చిక మైదానాలతో ఈ ప్రదేశంలో గడపడం పర్యాటకులకు ఎంతో ఉత్సాహాన్నిస్తుంది. నిత్యం సినిమా షూటింగులతో హజన్ అనే ప్రాంతం సందడి సందడిగా ఉంటుంది. ఇక్కడ చిన్న పరిశ్రమలు కూడా ఉన్నాయి. ఆసియాలో కుంకుమపువ్వు పండించే అతి కొద్ది ప్రాంతాల్లో ఇది ఒకటి.

హిందువులు పవిత్రంగా భావించే అమర్‌నాథ్ యాత్ర ప్రారంభ స్థలమైన చందన్‌వారీ ఇక్కడికి 16 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ అమర్‌నాథ్ యాత్ర ప్రతి సంవత్సరం జులై నుండి ఆగస్ట్ మధ్యలో జరుగుతుంది. ఇక్కడ ఉన్ని వస్త్రాలకు ప్రసిద్ధి. పర్యాటకులకు గుర్రపు స్వారీ ప్రధాన ఆకర్షణగా వుంటుంది. ఈ మార్గంలో కొండలను దాటి మైదాన ప్రాంతానికి చేరడం చాలా కష్టం. అలవాటు లేనివారు అసలు నడవలేరు. అప్పుడు గుర్రాలమీద ఎలాంటి అసౌకర్యం లేకుండా ఈ పర్వతాలను అధిరోహించవచ్చు.

పట్టిందల్లా బంగారమేనట!

2740 మీటర్ల ఎత్తులో ఉన్న హిమాలయ పర్వతాలు నిత్యం మంచుతో కప్పబడి వెండి కొండలను తలపిస్తాయి. చుట్టూ తెల్లటి మంచుతో కప్పబడిన పర్వతాల మధ్యలో ఉన్న ఈ మైదాన ప్రాంతాన్ని "బంగారు మైదానీ" అని పిలుస్తారు. ఈ మైదానాల చుట్టూ కొండ రావిచెట్లు, పొడవైన దేవదారు వృక్షాలు, బంగారు వర్ణంలోని అల్‌ఫైన్



సోనామార్గ్

దాల్‌లేక్‌లో విహరించే బోట్‌హౌసులు



పువ్వుల చెట్లు... ఇలా రకరకాల వృక్షాలు అడవులను తలపిస్తాయి. సింధు నది యొక్క స్వచ్ఛమైన జలాలు ప్రవహించే పట్టణ ప్రాంతంలో ఇవి ఉన్నాయి. ఇక్కడ ఒక రహస్య బావి ఉందనీ, అది ప్రతి దానినీ బంగారంగా మారుస్తుందనీ ఒక కథనం ప్రచారంలో వుంది. దానివల్లే ఈ ప్రాంతానికి సోనామార్గ్ అని పేరు వచ్చిందని స్థానికులు చెప్తారు. లధక్ ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారి ఇక్కడే ఉంది. ఒకప్పుడు మధ్య ఆసియాలోకి వెళ్లడానికి కూడా ప్రధాన రహదారిగా సోనామార్గ్ ఉండేది. ఇక్కడి మంచు పర్వతాలపై పర్యాటకులు ఎంతో ఇష్టంగా స్కేటింగ్ చేస్తారు. ఇక పోతే మంచు వర్షాలు ఇక్కడ సర్వసాధారణమైన విషయం. శీతాకాలంలో రాత్రి ఉష్ణోగ్రతలు -7 నుండి -17 డిగ్రీల సెల్సియస్ వరకు ఉంటాయి. దక్షిణ భారతదేశం నుండి వచ్చిన పర్యాటకులు ఈ చలిని తట్టుకోడానికి ఉన్ని దుస్తులు, బూట్లు లాంటివి ఇక్కడి షాపుల్లో అద్దెకు తీసుకుంటారు. వినోద కార్యక్రమాల్లో పాల్గొనాలన్నా, ఆట పాటలకి, స్కేటింగ్‌కి, చుట్టుపక్కల పర్యాటక స్థలాలను చూడాలన్నా వాటితోనే.

కొండలను దగ్గరగా చూడాలంటే...

గుల్‌మార్గే శరణ్యం...

పర్వతాలపైకి చేరుకుని హిమాలయ కొండలను దగ్గరగా చూడాలంటే గుల్‌మార్గ్ వెళ్లి తీరాల్సిందే. గుల్‌మార్గ్‌లోని దొంతాలా స్టేజ్ - 2 కు చేరడానికి జె అండ్ కె టూరిజం వారు రోప్‌వేలను ఏర్పాటు చేశారు. ఈ రోప్‌వేలో ప్రయాణించి స్టేజ్ - 2 కు చేరుకుంటే పర్వత ప్రాంతం చివరికి అంటే సముద్ర మట్టం నుండి 10,500 అడుగుల ఎత్తుకు చేరతాం. అక్కడి నుండి అతి దగ్గరగా మంచుతో కప్పబడిన హిమాలయాలను చూస్తుంటే... అంతటి అద్భుతమైన క్షణాల్ని మాటల్లో చెప్పడం సాధ్యం కాదేమో. ఎంత సేపైనా ఆ వెండి కొండలని చూస్తూ ఉండిపోవాలనిపిస్తుంది. కాకపోతే అంత చలిని తట్టుకోవడం కష్టం కదా. అందుకే తిరిగి రావాలనిపించకపోయినా తప్పక వెనుతిరిగి రావాల్సొచ్చింది. ఇక్కడ గుర్రపు స్వారీ, గోల్ఫ్, స్కేటింగ్ లాంటి రకరకాల ఆటలతో పర్యాటకులు ఆనందంగా గడుపుతారు.

నగరానికే శోభనిచ్చే దాల్ సరస్సు

భారతదేశంలోని అద్భుత సరస్సుల్లో కాశ్మీర్‌లోని దాల్ సరస్సు ఒకటి. ఇది జమ్ము - కాశ్మీర్‌లోని అతి పెద్ద సరస్సుల్లో రెండోది. ఈ సరస్సుకు మూడు పక్కలా ఎత్తైన పర్వతాలు ఉన్నాయి. చుట్టూ ఉన్న తోటలతో ఈ సరస్సు కాశ్మీర్ నగరానికే శోభను తెచ్చింది. 6/3 కిలోమీటర్ల కొలతతో ఉన్న ఈ సరస్సు ఒక్కో కిలోమీటర్ దూరం పోయేకొద్దీ ఒక్కోలా కనిపిస్తుంది. దాల్ సరస్సు చుట్టు పక్కల మొఘల్ చక్రవర్తుల కోటలతో పాటు కాశ్మీర్ యూనివర్శిటీ, శంకరాచార్య గుడి ఉన్నాయి. ఇందులో ఏర్పాటు చేసిన బోట్ హౌస్‌లో ఉంటూ సరస్సులో బోటింగ్ చేస్తూ పర్యాటకులు ఎంతో ఆనందంగా గడుపుతారు. అనేక మంది మత్స్యకారులకు ఈ సరస్సు జీవనోపాధిని కలిగిస్తుంది.

మైమరిపించే మొఘల్ గార్డెన్స్

మొఘల్ చక్రవర్తులు టెహ్రాన్ నుండి ఆగ్రా వరకు ఉద్యానవనాలను నిర్మించినా కాశ్మీర్‌లో అవి ప్రత్యేకంగా కనిపిస్తాయి. రకరకాల పూదోటలతో నిండిన ఈ ఉద్యానవనాలతో కాశ్మీర్ మరింత అందంగా కనిపిస్తుంది.

కట్టిపడేసే కుంకుమపువ్వు తోటలు

ప్రపంచం మొత్తంలో కుంకుమ పువ్వు పండించే అతి కొద్ది ప్రాంతాల్లో కాశ్మీర్ ఒకటి. ఇక్కడ రెండు ప్రాంతాల్లో మాత్రమే కుంకుమ పువ్వు పండుతుంది. శ్రీనగర్‌కు 13 కిలోమీటర్ల దూరంలోని పాంపూర్‌లో వీటిని పండిస్తారు. ఈ మొక్క చాలా చిన్నగా ఉంటుంది. పువ్వులు మాత్రమే భూమి పైకి కనిపించడం ఈ మొక్క ప్రత్యేకత. ఆకురాలు కాలమైన శీతాకాలం, వేసవి కాలాల మధ్యలో ఈ పంట వస్తుంది. ఈ పూలు ఒక ప్రత్యేక సువాసనతో ఉంటాయి. ఒక విధమైన నీలిరంగుతో కొద్దిగా భూమిపైకి వచ్చిన ఈ పూలు ఒక సుందర దృశ్యాన్ని కళ్లముందుంచుతాయి. అక్టోబర్ నెల మధ్యలో మూడు వారాల పాటు వికసించే ఈ పూలను పౌర్ణమి నాటి వెన్నెల్లో చూడ్డానికి మొఘల్ చక్రవర్తైన జహంగీర్ ఎంతో ముచ్చటపడేవాడని చెపుతారు. ఈ పువ్వులో అనేక ఔషధ గుణాలున్నాయని అంటారు. సౌందర్య సాధనాల్లోనూ, వంటలలోనూ ప్రత్యేక రంగు, రుచి కోసం దీన్ని వాడతారు.



గుల్‌మార్గ్‌లో గుర్రాల స్వారీ...

మంచు రాల్చుకునే చెట్లు

కాశ్మీర్‌లో మంచు కురిసే ప్రాంతంలోని చెట్లకు ఒక ప్రత్యేకత ఉంది. మంచు కురిసే కాలంలో ఇక్కడి చెట్లు తమ ఆకులన్నీ రాల్చుకుని చెట్లపై మంచుభారం పడకుండా చేస్తాయి. అదే మంచు కురవని అటవీ ప్రాంతాల్లో మాత్రం పచ్చని ఆకుల్తో నిండివున్న చెట్లు కనిపిస్తాయి. ప్రకృతి సహజమైన ఈ మార్పును చూస్తే ఆశ్చర్యం కలగకమానదు.

ఉన్ని దుస్తులు ప్రత్యేకం

కాశ్మీరీ గొర్రెల నుండి సేకరించిన ప్రత్యేక ఉన్నిని పష్మినా ఉన్ని అంటారు. ఇక్కడి మహిళలు ఈ ఉన్నితో శాలువాలు, కార్పెట్లు, ఉన్ని దుస్తు తయారు చేస్తారు. వాటిపై అందమైన ఎంబ్రాయిడరీ వర్కు చేయడం వీరి ప్రత్యేకత. ఉన్ని దుస్తులపై చేత్తో పూలు కుట్టిన వస్త్రాలను ఇక్కడ ఎక్కువగా వాడతారు. ఇక్కడ చాలా ప్రాంతాల్లో మద్యపాన నిషేధం పూర్తిగా అమల్లో ఉంది.

విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల మేలు కలయికగా ఉన్న కాశ్మీర్‌లో స్వచ్ఛమైన గాలి, నీరు, అడవులు, కొండలు, లోయలు, మంచు పర్వతాల మధ్య పర్యటించడం ప్రతి పర్యాటకునికీ జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకంగా మిగిలిపోతుందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ★

శవ 'సేవ'లు

ఒకప్పుడు మరణం అంటే భయంకరమైన భావన ఉండేది (ఇప్పటికీ కాస్త అలాగే ఉందనుకోండి). కానీ ఇప్పుడు మనుషులు తమ అంత్యక్రియలు ఏ విధంగా ఉండాలో కూడా ముందే నిర్ణయం చేసుకుంటున్నారు. మరణం అనివార్యం అని తెలిసిన తరువాత దానినీ అందంగా, ఆనందంగా 'అనుభవిద్దాం' అనే ఆలోచన ఆహ్వానించ తగ్గదే, అభినందించదగ్గదే. "మరణం దానికదే అందమైనది. కాకపోతే ఏడుపులూ, శోకాలూ దానిని భయంకరంగా మారుస్తాయి" అని వందేళ్ల క్రితం రాశాడు ప్రఖ్యాత తత్వవేత్త, శాస్త్రవేత్త, రచయిత ఫ్రాన్సిస్ బేకన్. మన దేశంలో 'చావు కూడా పెళ్లి లాంటిదే' అన్నాడో కవి. జీవితం ముగించిన ఓ జీవిని (వుందో లేదో తెలీని) మరో 'లోకానికి' సాగనంపడానికి మన ప్రయత్నం మామూలుగా ఉండదు! నిజానికి పెళ్లి కంటే చావు విషయంలోనే సెంటిమెంట్లు ఎక్కువ. బతికున్నప్పుడు ఎలా చూసుకున్నాం అనేదానికంటే, పోయినప్పుడు ఎలా పంపాము అన్న విషయానికి ప్రాధాన్యత ఎక్కువ.

ఒక మనిషి చావుపై ఆధారపడిన వ్యాపారాలు అనేకం ఉన్నాయి. అంతిమ సంస్కారాల సంబంధిత వ్యవహారాలు... కట్టెలు, పేటికలు, పూలు, దండలు, కుండలు, డప్పులు డబ్బులు, ఊరేగింపులు, ఊరడింపులు, పిండ ప్రదానాలు, అస్థిక నిమజ్జనాలూ, షామియానాలు, సమాధులు, సమారాధనలు, పాలరాళ్ల, గోపురాలు... చివరికి కొత్తబట్టలు, విందు భోజనాలు, కానుకలు, జ్ఞాపకాలు, జ్ఞాపకార్థ కూటములు, ఏటా సంస్మరణలు, సభలు... చివరికి ఓదార్పులు, ఇన్సూరెన్స్‌ల వరకు అన్నీ అసలు మరణించిన మనిషితో సంబంధం లేనివే. వీటిలో కూడా కొన్ని తాహతును బట్టి ఘనంగా ఆర్భాటంగా అల్పంగా, స్వల్పంగా జరిగితే కొన్ని అవసరాన్ని బట్టి రహస్యంగానూ జరిగిపోతుంటాయి. విశేషమేమిటంటే, సదరు కార్యక్రమాలన్నీ వ్యాపారంతో ముడిపడి ఉన్నవే!!

మన దేశంలో గొప్ప వాళ్ల సమాధులు చారిత్రాత్మక, దర్శనీయ, యాత్రా స్థలాలుగా రూపాంతరం చెందడం, కాని పక్షంలో ఆ విధంగా వాటికి ప్రచారం కల్పించడం మనకి పరిచయమే. తన సహచరి కోసం నిర్మించిన తాజ్ మహల్ సహా అటువంటి అనేకానేక సమాధులు నేడు సందర్శకులతో కిటకిట లాడుతున్నాయి. మామూలు శ్మశాన వాటికలలో కాలు పెట్టడానికి జంకేవారు, కనీసం కన్నెత్తి కూడా చూడటానికి భయపడే వారు ఎంతో సమయం, డబ్బు ఖర్చు చేసుకుని మరీ అటువంటి ఖరీదైన గోరీలు చూసి వస్తారు! పూర్వ ప్రధానులూ, ముఖ్య మంత్రులూ వంటి వారి సమాధులు మామూలు శ్మశానాలలో

యాభై ఎనిమిదేళ్ల ర్యాండి అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించాడు. ఆ మరుసటి రోజు అతని భార్య డయానే, 'సింపుల్ ఫ్యూనరల్స్' అనే సంస్థ కార్యాలయానికి వెళ్లింది. ఆ సంస్థ అంత్యక్రియలను నిర్వహిస్తుంది. సాంప్రదాయకంగా ఆ క్రియలు చేస్తే సుమారు మూడున్నర వేల డాలర్ల ఖర్చు అవుతుంది. కానీ ఈ సంస్థ అతి సాదా సీదాగా కేవలం పదకొండు వందల డాలర్లతో పని ముగిస్తుంది. మరుసటి రోజున, ఒంటి చేత్తో డయానే తన భర్త అంతిమ సంస్కారాలను తన బడ్జెట్‌లో ముగించింది. అంతిమ క్రియల విషయంలో బేరాలు ఆడలేని ఇబ్బందికర పరిస్థితులలో ఇటువంటి కంపెనీలు ఉన్న బడ్జెట్‌కి అనువుగా చేసి ఆదుకుంటున్నాయి.

నలభైఎనిమిదేళ్ల వ్యాపారవేత్త బేకర్‌కి తన పార్థివ శరీరం తనకిష్టమైన చెక్కపెట్టెలో తనకిష్టమైన డిజైన్‌తో వెళ్లాలని కోరిక. దానిని అతడు ఒక ఫ్యూనరల్ సంస్థకి ముందే చెప్పి తగిన అంగీకారాలు జరిపించుకున్నాడు. చాలా మంది తమ చివరి కోరికలు కోరుతుంటారు కానీ అన్నీ కోరిన ప్రకారమే జరుగుతాయన్న నమ్మకం లేదు. అయితే, ఫ్యూనరల్ కంపెనీలు మాత్రం తమ క్లయింట్ల కోరికలు కచ్చితంగా నెరవేరుస్తారు. ప్రపంచంలో చాలా దేశాలలో ఇలా 'అంత్యక్రియల కంపెనీల' వ్యాపారం 'మూడు చావులు ఆరు క్రియలు'గా దినదినాభివృద్ధి చెందుతూనే వుంది.

- డా॥ కాకర్లమూడి విజయ్

ఉండవు, వారి శ్మశానాలలో మరెవరి సమాధీ ఉండదు. ఎకరాలకు ఎకరాలు వారి సమాధి కోసం, లక్షలకు లక్షలు వాటి నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఖర్చయిపోతుంటాయి. కానీ సగటు మనిషి చనిపోతే పూడ్చడానికీ, ఒక రాయి పెట్టడానికీ నగరాలలో స్థలాలు కరువయ్యాయి. శ్మశానాలు నిండి పోయాయి. ఆ కారణంగా చాలా చోట్ల విద్యుత్‌తో పార్థివ శరీరాన్ని దహనం చేసే వీలు ఉన్నా అందుకు ఇష్టపడే వారు తక్కువ (అలా చేయాలని సదరు మనిషి చివరి కోరికలాంటిది చెప్పి చనిపోతే తప్ప). తదనంతరం మన శరీరాన్ని వైద్య విద్యకు తోడ్పడే విధంగా దానం చేయడమూ గొప్ప పనే అనుకునేవారూ అరుదే.

పార్శీలు తమ వారి పార్థివ శరీరాన్ని పంచభూతాలకు వదిలి, దానిని రాబందులు ఆహారంగా తీసుకుంటే తృప్తి పడ్తారు. మట్టి నుండి మట్టికి అని ఒకరి నమ్మకమైతే, గంధపు చెక్కలపై నెయ్యిపోసి మరీ అగ్గితో బుగ్గి చేసి, విభూతిని నదిలో కలిపే విశ్వాసం మరొకరిది. అతి అట్టహాసంగా, ఆర్భాటంగా కొందరు వీడ్కోలు చెబితే గంభీరంగా, గౌరవంగా సాగనంపేవారు కొందరు. డాన్సులు చేస్తూ సాగనంపేవారు మరికొందరు.

ఈజిప్ట్‌లో రాచ శవాలకు అనేక రసాయన పూతలు పూసి వాటిని సుదీర్ఘ కాలం భద్రపరిచే అలవాటు ఉండేది. అటువంటి అలవాటు మరోచోట అంతగా కానరాదు. ముందు నుండీ విగత జీవులను ఖననం చేయడం ఆనవాయితీగా ఉండేది. అయితే 20 వేల ఏళ్ల క్రితమే దహనం జరిగేదని ఆస్ట్రేలియాలో లభించిన ఆధారాలు చెబుతున్నాయి. అన్ని రకాలుగా దహనమే మెరుగనే అభిప్రాయంతో క్రీస్తు పూర్వం మూడు వేల ఏళ్ల క్రితం నుండే అటు యూరప్ ప్రాంతాలలోను, ఇటు ప్రాక్ ప్రాంతాలలోను దహన క్రియల అలవాటు ప్రారంభమైనదని చరిత్ర. ఇప్పటికీ కొన్ని మతాలలో ఖననం ఆనవాయితీ అయినా, దహనమే మంచిదనే అభిప్రాయం వ్యక్తమౌతున్నది. ఇస్లాం మతం మాత్రం కచ్చితంగా ఖననమే పాటిస్తుంది.

◆◆◆

చెప్పొచ్చేదేమిటంటే, మరణం తరువాతి కార్యక్రమాలు భావాలకి, ఉద్వేగాలకి, విశ్వాసాలకి, సెంటిమెంట్లకు సంబంధించిన వ్యవహారాలు. కానీ తాళి కట్టడం తప్ప పెళ్లిలో మిగతావన్నీ "అవుట్ సోర్సింగ్"కి ఇచ్చినట్టు, చావు తతంగం కూడా పూర్తిగా "అవుట్ సోర్సింగ్" అవుతోంది... ఒక్క చనిపోవడమే మనం చేయాల్సింది! ఏంటీ ఇదంతా నమ్మశక్యంగా లేదా? పాశ్చాత్యదేశాలలో ఫ్యూనరల్ (అంత్యక్రియలు) పరిశ్రమే వుంది. అదీ బిలియన్ల డాలర్ల పరిశ్రమ. వారి పని ఎవరు చనిపోతారా అని ఎదురు చూస్తూ ఉండటమే! ఇక 'పోయినోళ్లు' దొరికారా... కావలసిన రీతిలో కోరుకున్న తీరులో 'యథా డాలర్, తథా సర్వీసు' చేయడమే. సాంప్రదాయవాదులు ఈ వ్యాపార వ్యవహారంపై నొసలు చిట్లిస్తారు గానీ కొత్త తరం ఈవెంట్ మేనేజర్లు మాత్రం ప్రపంచంలో అతి పురాతనమైన వ్యాపారాలలో ఒకటైన అంత్యక్రియల పరిశ్రమను విప్లవాత్మకంగా రూపుదిద్దుతున్నారు. వీళ్ల అంతిమ సంస్కారాలు ఏ విధంగా ఉండాలని కనే కలలని నిజాలు చేసేస్తున్నారు. ఒకరికి తనకి ఇష్టమైన కలపతో పేటిక కావాలని ఉంటుంది. మరొకరు తనకిష్టమైన కారు ఆకారంలో పేటిక కావాలని కోరుకుంటారు. పదేళ్ల క్రితం అమెరికా హెచ్‌బిఓ ఛానల్‌లో 'సిక్స్ ఫీట్ అండర్' (ఆరడుగుల కింద) అనే ఒక సీరియల్ అయిదేళ్లపాటు ప్రసారమైంది. ఫ్యూనరల్ పరిశ్రమ నేపథ్యంలో సాగే ఈ సీరియల్ అటు ప్రజాదరణ, విమర్శకుల ప్రసంశలతో పాటు ఎందరికో వ్యాపార స్ఫూర్తినీ ఇచ్చింది. ఆ సీరియల్ చూసి కొత్తగా ఫ్యూనరల్ పరిశ్రమ నెలకొల్పిన వారు చాలా మంది ఉన్నారు.

మనకి ఈ మధ్య తరచూ కనిపిస్తున్న ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలుగా ఫ్యూనరల్ సర్వీసు సంస్థలు మనిషి అంత్యక్రియలకయ్యే సకల సేవలను అందిస్తాయి. పార్థివ శరీరాన్ని ఆసుపత్రి నుండి గానీ, ఇంటి నుండి గానీ,

అద్దెకు ఏడుపు

మనకు తెలిసిన వాళ్లు గానీ, మనల్ని కలిసిన వాళ్లుగానీ, నాలుగు రోజులు మనతో కలిసున్న వాళ్లు గానీ ఇక లేరు అని తెలిస్తే బాధ. మనతో కొంతకాలం గడిపి మళ్లీ కనిపించకుండా వెళ్లిపోతే దుఃఖం. అది అదుపు తప్పితే గుండె మంటలు ఆవిరై, కళ్లలో ద్రవించి కన్నీరుగా జారతాయి. శోకం శబ్దమై రోదనవుతుంది. మన వాళ్లు మరణిస్తే మనిషన్న వాడికి రోదన సహజం. కొందరు అణచి పెట్టుకుంటారు. కొందరు తెచ్చి పెట్టుకుంటారు.

కానీ రోదించడం కోసమే కొందర్ని తెచ్చి పెట్టే వాళ్లూ ఉన్నారు. రాజస్థాన్‌లో ఉన్నత కులాల పురుషులు మరణిస్తే...ఆ కుటుంబంలోని స్త్రీలు రోదించడం నిషిద్ధం. అయితే రోదనలు లేకుండా శవ సంస్కారం జరగదు. అందుచేత ప్రత్యేకంగా రోదించే స్త్రీలను పురమాయిస్తారు. రుదాలీ అనబడే ఈ స్త్రీలు తక్కువ కులస్తులు, రోదన వృత్తి నిపుణులు. వారి పని కేవలం శవం దగ్గర రోదించి వెళ్లిపోవడమే...కూలి తీసుకొని.



మరెక్కడి నుండైనా తీసుకురావడం నుండి, శరీరానికి రసాయన లేపనాలను పూయడం, అలంకరించడం, తగిన/కోరిన పేటికను తయారు చేయించడం, అందులో ఉంచవలసిన వస్తువులను స్వీకరించడం, ఎవరెవరికి వార్త అందించాలో చూసుకోవడం, ఎవరెవరిని ఆహ్వానించాలో వారిని పిలవడం, శ్మశాన వాటికకు తరలించడం, అక్కడ ఆహుతులను గౌరవ మర్యాదలతో తీసుకురావడం, మత పెద్దలను ఏర్పాటు చేయడం, చల్లడానికి పూలు, శవంపై ఉంచడానికి బోకేలు ఏర్పాటుచేయడం, ఖనన కార్యక్రమాలను నిర్వహింప చేయడం, ఆ పిదప కొన్ని రోజుల వరకు సంస్మరణ కార్యక్రమాలను చూసుకోవడం వరకు ఈ కంపెనీలు చేస్తాయి. అంటే, డబ్బు ఇచ్చి, ఏవేవి కావాలో చెబితే చాలు! మనకు సంబంధించి పోయిన వారిని వారే రప్పించుకుని మరీ సాగనంపుతారు... మనం వెళ్లి పూలు చల్లి రావడమే!

ఇటువంటి శవ సేవలు చాలా కాలం నుండే ఉన్నా, ఇటీవల వీరిపై ఆధార పడేవారు ఎక్కువయ్యారట. తద్వారా శవ సేవల వ్యాపారం విస్తరిస్తూ వృద్ధి చెందుతోందని వార్తలు. అమెరికాలో సుమారు 23000 శవ సేవ కంపెనీలు ఉన్నాయి. అవి సగటున వారానికి రెండు అంత్యక్రియలు నిర్వహిస్తుంటాయి. ఈ కంపెనీలలో స్టాక్‌లు, షేర్లు కూడా ఉండి, ప్రముఖ స్టాక్ ఎక్స్చేంజ్‌లలో లిస్టు అయినవీ ఉన్నాయి. అలాగే కొన్ని దివాలా తీసినవీ ఉన్నాయి.

ఫ్యూనరల్ హోమ్స్ అనేవి గత శతాబ్దంలో ప్రారంభమైనవే. అప్పటివరకూ, అమెరికాలో అయినా, యూరప్‌లో అయినా అంతిమ సంస్కారాలు కేవలం కుటుంబ వ్యవహారంగా ఉండేవి. మన దేశంలో లాగే. చనిపోయిన వారిని కుటుంబ స్థలాలలోనే ఖననం చేసేవారు. అయితే, క్రమ క్రమంగా ఉమ్మడి శ్మశాన వాటికలు ప్రాధాన్యత పొందాయి. ఆ తరువాత ఇటువంటి సంస్థలు పుట్టి, అసలు మనిషి పోయి బాధల్లో ఉన్న కుటుంబాలకి ఇతర కర్మకాండల బరువు తగ్గించడానికి ఇతోధికం సాయపడుతున్నాయి.

ఒకప్పుడు శవాల కోసం పేటికలు తయారు చేసే వారే ఇటువంటి వ్యాపారాలలో ఎక్కువగా ప్రవేశించారు. ఇటువంటి 'అండర్ టేకర్'లకు ఇదొక కొనసాగింపు వ్యాపారం. వారి ప్రాథమిక వ్యాపారం మాత్రం పేటికలు చేయడమే అయితే వారికి ఇతర బాధ్యతలూ తోడయ్యాయి. శవాలకు రసాయన పూతలు పూయడం, తద్వారా వాటిని కొంతకాలం భద్రపరిచే వీలు కలిగించడం వంటివి ఈ బాధ్యతల్లో కొన్ని. ఈ కార్యక్రమంలోనే నైపుణ్యం, ధైర్యమూ అవసరమే. ఇది అందరూ చేయలేని పని మరి.

ఆర్థిక మాంద్యం, రెసిషన్ వంటి పరిస్థితులు ఎన్ని వచ్చినా వాటికి అతీతంగా నడిచే వ్యాపారం ఫ్యూనరల్ సర్వీసులే. నిత్యం పెరుగుతూనే ఉండే మరణాలు ఈ పదిహేనువేల బిలియన్ డాలర్ల వ్యాపారాన్ని కాచి కాపాడుతున్నాయి. ఆర్థిక పరిస్థితి ఎలా వున్నా మరణాలు ఆగవు, పోయిన వారిని సాగనంపడానికి వున్న వారు ఖర్చు చేయడమూ ఆగదు (ఒక మనిషికి ఇచ్చే గౌరవం డబ్బుతో కొలిచే వ్యవస్థ మనది). లాభాలు తక్కువయినా అసలు వ్యాపారం మాత్రం కొనసాగుతూనే ఉంటుంది. కాకపోతే ఈ మధ్య ఈ కంపెనీలు కూడా ఇతరుల చావు కోసం ఎదురు చూస్తున్నాయట!

మానవ జీవితంలో మరణం తప్పించుకోలేని ఘటన. అలాగే అంతిమ సంస్కారాల కార్యక్రమమూ తప్పించుకోలేనిదే.... సైన్స్‌గానీ టెక్నాలజీ గానీ ఆ కార్యక్రమాలను సులభతరం చేసేవరకూ! అంతవరకూ అంతిమ వీడ్కోలు ... మన వాళ్లకు మన తరపున ఇవ్వడానికి... కంపెనీలు పని చేస్తూనే ఉంటాయి.... డబ్బు తీసుకుని.

★

మహిళలు నిర్వహించే కార్యాలయాలు

మన ప్రాంతంలో అంత్యక్రియలంటే... పురుషులే చేస్తారు. మహిళల భాగస్వామ్యం తక్కువ. కానీ ఓ నలభైఏళ్ల క్రితం వరకూ అమెరికాలో ఫ్యూనరల్ హోమ్‌ల నిర్వహణలో స్త్రీలు అయిదు శాతం ఉండేవారు. ఇప్పుడు వారు నలభై మూడు శాతానికి పెరిగారు. అలాగే మార్చురీ సైన్సు విద్యార్థులలో కూడా మహిళల శాతం పెరిగింది. చరిత్రలో కూడా, అంత్యక్రియలలో స్త్రీల పాత్ర ప్రముఖంగా ఉండేది. ప్రాచీన గ్రీస్‌లో శవ స్నానాలూ, వస్త్రాలంకరణ, లేపనాల పూతలూ వంటి కార్యక్రమాలను స్త్రీలే నిర్వహించేవారు. ప్రాచీన హిబ్రూ సాంప్రదాయాలలో శవ స్నానాలూ ఇత్యాది చర్యలు అశుద్ధమైనవిగా భావించి వాటిని స్త్రీలకూ అప్పగించే వారు. అమెరికాలో మృత శరీరాలకు లేపన పూతల పట్ల పెద్దగా అవగాహన ఉండేది కాదు. అయితే సివిల్ వార్‌లో మరణించిన

సైనికులను వారి ఇళ్లకు పంపడానికి లేపనాలు పూసి భద్రపరచవలసిన అవసరం ఏర్పడింది. క్రమంగా అంత్యక్రియల పరిశ్రమ పుట్టుకొచ్చింది. ఇరవయ్యవ శతాబ్దంలో లీన ఓడౌ అనే స్పానిష్ నర్సు అమెరికాలో ఒక స్కూల్ తెరిచింది. శవాలకు లేపనాలు రాసి అంత్యక్రియలకు తయారు చేయడమెలా? అనేది నేర్పించడం ఆమె పని. పంతొమ్మిదివందల యాభైలలో అమెరికాలో కూడా మహిళలను రెండవ శ్రేణి పౌరులుగానే చూసేవారు. వ్యాపారాలలో అంతగా ప్రోత్సహించేవారు కాదు. డెబ్భై, ఎనభయ్యవ దశకాలలో ఫ్యూనరల్ పరిశ్రమ సహా అన్ని రంగాలలో... స్త్రీలకు అవకాశాలు మెరుగయ్యాయి. ఈ రోజు, మిల్వాకీ టెక్నికల్ కాలేజ్‌లోని ఫ్యూనరల్ సైన్సు కోర్సులో 75% మహిళా విద్యార్థులే వున్నారు. అనేక ఫ్యూనరల్ కంపెనీల్లో మహిళా డైరెక్టర్లు వున్నారు.

చావుకో చదువు

మన ప్రాంతాలలో కొన్ని వర్గాలకే/కులాలకే పరిమితమైన అంత్యక్రియల బాధ్యతలు ఇతర దేశాలలో వ్యాపార మార్గాలు. వ్యాపారం అంటే ఎవరు బడితే వారు చేసేకంటే, ఆ రంగంలో నైపుణ్యం ఉన్న వారుంటే మరింత బాగుకదా. మరి అంత్యక్రియల్లో నైపుణ్యం సాధించడం ఎలా? ఈ ప్రశ్నకు సమాధానమే -- ఫ్యూనరల్ సర్వీసెస్‌లో ఎంబిఏ! యూరప్‌లో ఈ చదువు అందుబాటులో వుంది. దీనికి డిమాండ్ కూడా బాగానే ఉంది. ఎనిమిది వందల గంటల కోర్సుకి ఫీజు ఎనిమిది వేల యూరోలు.



అభ్యుదయవాదులకు చిరుకానుక

ప్రచురణ అవుతున్న పుస్తకాలన్నీ సమాజంలోని అన్ని వర్గాలకు ఉపయోగపడవు. ఒక్కో పుస్తకం ఒక్కో తరహా కేటగిరీకి సంబంధించిన వ్యక్తులకు, సమూహాలకు ఉపయోగపడుతుంది. కమ్యూనిస్టు పార్టీని ఎలా నిర్మించాలి? దానికోసం చేయాల్సిన కృషి ఏ విధంగా వుండాలి? తెలుసుకోవాలంటే తప్పక చదవాల్సిన పుస్తకాల్లో "పార్టీ నిర్మాణం - ప్రజాసంఘాలు" ఒకటి.

50 సంవత్సరాలు సుదీర్ఘకాలంపాటు కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసిన అనుభవంతో వివిధ దేశాల్లో జరిగిన విప్లవాల అనుభవాల నుండి సిపియం సీనియర్ నాయకులు కీ॥శే॥ లావు బాలగంగాధరరావు చెప్పిన విషయాలకు పుస్తక రూపం "పార్టీ నిర్మాణం - ప్రజాసంఘాలు". ఎవరు అవునన్నా, కాదన్నా ప్రపంచ ప్రజానీకంపై కమ్యూనిజం చెరగని ముద్ర వేసింది. కార్మికవర్గం, కష్టజీవులు కమ్యూనిజం పతాక నీడన దోపిడీ నుండి విముక్తి పొంది కొత్త సమాజాన్ని స్థాపించారు. ప్రజాసంఘాలను స్థాపించడం, దాని నుంచి కమ్యూనిస్టుపార్టీ నిర్మాణం చేయడం విప్లవోద్యమాలు జరిగిన అన్ని దేశాల అనుభవం. భారత దేశానికి కూడా అదే వర్తిస్తుంది.

భారత దేశంలో కూడా ప్రస్తుత పాలకవర్గాలు అనుసరిస్తున్న విధానాల నుంచి ప్రత్యామ్నాయం కోరుకొనేవారు కమ్యూనిస్టుల వైపు చూడటం తప్పనిసరి. కమ్యూనిస్టులైనవాళ్ళు పార్టీ, ప్రజాసంఘాలను నిర్మించడం గురించి తెలుసుకోవాలి. సిపియం కార్యకర్తలను ఉద్దేశించి చెప్పిన విషయాలే అయినా కమ్యూనిజం పట్ల ఆసక్తి గలిగిన ప్రతి అభ్యుదయవాది ఈ పుస్తకం చదవొచ్చు.

పార్టీ ప్రజాసంఘాల నిర్మాణం - లావు బాల గంగాధరరావు, ప్రచురణ-ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ , వెల : 40/-.

చైనా వ్యవసాయ జీవన పరిస్థితుల ప్రతిబింబం

చైనా గురించిన నవల అనగానే చైనా విప్లవోద్యమం గురించో, చైనాలో జరిగిన రైతాంగ పోరాటాల గురించో అనుకుంటే పొరపాటు పడ్డట్టే. చైనా గ్రామీణ జీవితాన్ని గురించి అర్థం చేసుకోవడానికి ఈ నవల కొంత ఉపయోగపడుతుంది. నోబెల్ బహుమతి గ్రహీత పెరల్ బక్ రాసిన "సుక్షేత్రము" (గుడ్ ఎర్త్) చైనాలో 1949కు ముందు దశకాల్లోని గ్రామీణ జీవితానికి ముఖ్యంగా నిరుపేదల జీవన పోరాటానికి అద్దం పట్టింది. ఇది బడుగు రైతు లాంగ్ లుంగ్ జీవితగాథ. జమిందారుగా మారిన కటిక దరిద్రుడు లాంగ్ లుంగ్ కడవరకు భూమిపట్ల వుండే ఆపేక్షను వదులుకోడు. భూమి మీద కష్టపడటం, చెమటను ధారపోసి పంటను పండించడం అతనికి సంతోషాన్నిచ్చే విషయం. రైతు జీవితాల్లో వుండే కరువులు, వరదలు, వలసల గురించి పెరల్ బక్ చక్కగా వివరించారు. కరువు కాలంలో జనం ఆకలితో అలమటించి నగరాలకు వలస పోయినా... అక్కడ సైతం తళుకు బెళుకులే తప్ప కడుపు నిండదు. రిక్షా కూలీలుగా చివరకు ముష్టివాళ్ళుగా మారిపోవడం చూస్తాం. కడగండ్లను అధిగమించి కష్టించి పనిచేసేవాడు.... భూమిని నమ్ముకొన్నవాడు అంతిమ విజయం సాధిస్తారన్నది సారాంశం. అత్యంత ప్రతిభావంతమైన కథనంతో ఉద్వేగ భరితంగా సాగే ఈ నవలలో సామాజిక స్పృహ గురించి ఆలోచించలేము. అనువాదకుడు పి.వి.రామారావు వాడుక భాష కంటే సంస్కృత పదాలకే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చారు. 'ఇచ్చినాను', 'తెచ్చినాను', 'పోయినాడు' మాటలను ఇచ్చాను, తెచ్చాను, పోయాడు అని రాయవచ్చు. గ్రంథ అనువాదమంతా ఇదే పద్ధతిలో వుంది. చైనాలో రైతాంగ జీవన పరిస్థితులు తెలుసుకొనే వారు ఈ పుస్తకం చదవవచ్చు.

సుక్షేత్రము- పెరల్‌బక్, ప్రచురణ, ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్, వెల : 75/-.

- కారుసాల

కొత్త పుస్తకాలు

The Heroic Telangana

A VOLCANO IN DORMANT

N. Sambasiva rao

price Rs :100/-,
pages : 139

స్వీకారం

నండూరి రాజగోపాల్
మొదటి పేజీలు
చినుకు సంపాదకీయాలు
వెల : 75/-
పేజీలు : 127
ప్రతులకు :
విశాలాంధ్ర బుక్ హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్, నవోదయా బుక్‌హౌస్ దిశ పుస్తక కేంద్రం, నవోదయా పబ్లిషర్స్.



కథ

ఎడబాటు

'ఏం మాట్లాడేది కొడకా! నా కొడుకు నాకు దక్కిండు. మాబువ్వ మేందింటన్నం. ఒకరి సొమ్ము మాకొద్దు. తల్లిదండ్రుల నుండి బిడ్డల్ని ఎడబాపేటోళ్లున్నరు. ఏడేండ్ల యాతన. ఒక్క నిమిషంల ఏం జెప్తమయ్యా? మీ బిడ్డల్ని జర భద్రంగా సూస్కొండి తల్లుల్లారా! బిడ్డల్ని సీటికి మాటికి కొట్టకండి. బిడ్డలు అలిగితే, వాళ్లే సదురుకుంటరని అనుకోకరి. సదువు రాకపోతే ఇగ ఇంతే సంగతనుకోకురి. తీరొక్క తురువులు. ఎవర్కి తోసిన కొలువు వాళ్లే జూస్కుంటరు.

- యెన్నం ఉపేందర్

"ఇంకెన్ని రోజులు మనం గీ పురుగులన్నం తింటం. తల్సుకుంటే కడుపుల కుల్లకుల్ల అయితుంది. మానూర్కి పోతే ఎట్లుంటది' నాగన్నని అడిగాడు సారయ్య.

'ఏహె ఊర్కో ఏం మాట్లాడ్తన్నవ్? మనూర్ల ఇప్పుడు ఏం మిగిలింది? మీ అమ్మయ్యలు మూటలకి మూటలు సంపాదించి పెట్టినార్రా? జనం పుట్టకొగరన్నట్లు పట్నానికి వలసలు పోబట్టిరి. నువు బోయి ఊళ్లో కూకుని తింటావురా?' మందలించాడు నాగన్న.

సారయ్యకి ఇంటి విషయం పూర్తిగా తెలుసు. అయినా హాస్టలు భోజనం గుర్తొచ్చేసరికి ఇంటిపై యావ మళ్లింది.

'ఏందో నాగ, నావల్ల కావల్లేదురా. ఇంటికాడ రోట్లో నూరిన గొడ్డుకారం నాల్కకి ఇతువుగా అనిపించింది గని, గీ మెతుకులల్ల పురుగులు సూస్తాంటే కక్కొస్తంది. ఏ పట్నమన్నా పారిపోతే' ఆలోచనగా అన్నాడు సారయ్య.

సారయ్య కళ్లలోకి సూటిగా చూస్తూ 'సాల్లేవోయి. పట్నం బోతవా? ఏ పట్నం బోయి ఏ ఉజ్జోగం జేస్తవ్? హాస్టల్ల బెట్టె నాలుగు మెతుకులు దినుకుంట నాలుగక్షరాలు నేర్చుకునేదానికి' అన్నాడు నాగన్న.

చీకటి క్రమక్రమంగా పెరగసాగింది. జనం అంతకంతకు పలుచనై, నిర్మానుష్యమైంది బస్టాండు.

'ఇదిగో నాగ. నేంబోతన్న. అన్నం బెట్టే యాలైంది. నువు ఎటూ బోగు. నాల్రోజులు కళ్ల మూసుకుంటే కాలం గడిసిపోద్ది. ఇంత సదువూ అబ్బుద్ది' అంటూ హాస్టల్ వైపు వెళ్లాడు నాగన్న.

సారయ్యకి ఏంచెయ్యాలో తెలీడం లేదు. రెండు కాళ్ల మధ్య తలానించి ఏదేదో ఆలోచించసాగాడు.

'తమ్ముడూ!' అన్న పిలుపు విని తల పైకెత్తాడు సారయ్య. ఎదురుగా ఓ బలిష్టమైన శరీరపతను.

'ఏ పట్నం బోయినా ఏం ప్రయోజనం చెప్పు' అన్నాడు దగ్గరకొస్తూ.

అతను తామిద్దరు మాట్లాడుకున్నదంతా విన్నాడని అర్థం చేసుకున్న సారయ్య బదులివ్వలేకపోయాడు.

"నాతో వస్తావా? మూడు పూటలూ తెల్లన్నం దొరుకుతుంది. డబ్బులు నెల నెలా నీ చేతుల్లో పడతయ్" అన్నాడు ఆ అపరిచితుడు.

'గిది ఒల్లెక్కమా నిజమా. ఈ హాస్టల్ కూడు ఎంతకాలం తినాలి? అయినా ఊళ్లో సదువుకున్నోళ్ల ఎంతమంది ఉజ్జోగాలు సేస్తండ్రు?ఎంతో పొడుగు సదివిన మల్లన్నకి మొన్న మొన్న పంతులుజ్జోగమైంది. ఆ లెక్కన సదవాలంటే అందరికీ అయిద్దా? అయినా ఎంత సదివినా నాలుగు డబ్బులు సంపాదించుకోడానికేగా. గీ సంగతేగా ముసల్ది సెప్పింది. ఈ మనిషిని దేవుడు పంపినట్లు కళ్ల ముంగట్కొచ్చిండు. అయినా ఏం పని ఇస్తడో?'

'ఏం పని ఇస్తవే'

'ఏం లేదు బిడ్డా. దుకాణాల పైసలెల్లెక్కబెట్టుడు'

'ఓసి గంతేనా?' అనుకున్నాడు సారయ్య.

'ఏ ఊళ్లో సారు పని' అడిగాడు సారయ్య.

'అవన్నీ తర్వాత చెబుతాగాని... ఈ బిస్కెట్లు తిను బిడ్డా. మధ్యాహ్నం అన్నం దిన్నవో లేదో' అంటూ బిస్కెట్లు అందించాడు ఆ వ్యక్తి.

ఆబగా తినడం మొదలుబెట్టాడు సారయ్య. తాను గ్రహించక ముందే మత్తుగా వాలిపోయాడు.

కళ్లు తెరిచి చూస్తే ఓ మురికివాడ. కొద్దిసేపటికిగాని తాను బస్టాండులో లేనని అర్థం చేసుకున్నాడు.

'అంటే! వామ్మో ఎత్తుకొచ్చిండా' లేచి పారిపోబోయాడు. కాళ్లకి గొలుసులు అడ్డుపడడంతో బోర్లా పడిపోయాడు. వీపుమీద ఏదో ఇనుప చువ్వతో దెబ్బ బలంగా పడింది. వీపు చిట్లి రక్తం కారసాగింది.

'అమ్మా' అని అరిచి తిరిగి చూస్తే ఎదురుగా సారయ్యని ఎత్తుకొచ్చిన వ్యక్తి. తాగాడేమో! తూలుతూ పొట్టలో బలంగా తన్నాడు.

ఆ దెబ్బకి సారయ్య నొప్పితో బిగుసుకుపోయాడు.

'ఏందిరా కొడకా! ఎటు బోవాల్నని లేచి ఉరకబోతున్నావురా. నీ వశం కాదు' మరో నాలుగు దెబ్బలేశాడు. ఆ దెబ్బలకు సారయ్య స్పృహ తప్పాడు.

చీకటి పడే వేళకు మెలకువ వచ్చింది. కడుపు ఆకలితో రగిలిపోతోంది. చేతికి గిన్నేదో తాకింది. అందులో నీళ్లూరుతున్న కూడు. ఆబగా నోట్లో వేసుకున్నాడు. బలవంతంగా కళ్లు తెరిచి చూస్తే తాను తినే గిన్నెలోదే కుక్క కూడా తినటం చూశాడు.

'ఛీ! ఏహె' అంటూ కుక్కని చరిచాడు.

'అంటే! వామ్మో ఎత్తుకొచ్చిండా' లేచి పారిపోబోయాడు. కాళ్లకి గొలుసులు అడ్డుపడడంతో బోర్లా పడిపోయాడు. వీపుమీద ఏదో ఇనుప చువ్వతో దెబ్బ బలంగా పడింది. వీపు చిట్లి రక్తం కారసాగింది.

'అమ్మా' అని అరిచి తిరిగి చూస్తే ఎదురుగా సారయ్యని ఎత్తుకొచ్చిన వ్యక్తి. తాగాడేమో! తూలుతూ పొట్టలో బలంగా తన్నాడు.

ఆ దెబ్బకి సారయ్య నొప్పితో బిగుసుకుపోయాడు.

'ఏందిరా కొడకా! ఎటు బోవాల్నని లేచి ఉరకబోతున్నావురా. నీ వశం కాదు' మరో నాలుగు దెబ్బలేశాడు. ఆ దెబ్బలకు సారయ్య స్పృహ తప్పాడు.

చీకటి పడే వేళకు మెలకువ వచ్చింది. కడుపు ఆకలితో రగిలిపోతోంది. చేతికి గిన్నేదో తాకింది.

పక్కనుంచి నవ్వులు వినిపించాయి. చూస్తే తన ఈడువాళ్లే ఓ నలుగురున్నారు. చింపిరి జుత్తుతో బట్టలుండీ లేకుండా, మూలుగులు లాంటి నవ్వులు వినిపిస్తున్నాయి. వారి పక్కనే బుద్ధిగా కూర్చున్న కోతులు.

కడుపులో పేగులు ఉండలు చుట్టుకుపోవడంతో ఆగలేక, గిన్నె ఖాళీ చేశాడు సారయ్య.

'రేయ్! వీడూ రేపు మీతోనే వస్తడు. వాడికో బజారు చూపించుర్రి. ఇదిగో నీ కోతి' అంటూ కోతిని కట్టిన గొలుసు చేతికిచ్చి జాడిచ్చి పొట్టలో తన్నాడు ఆ వ్యక్తి.

'అమ్మా' అని బాధగా మూలిగి, తిన్న అన్నంలాంటి పదార్థాన్ని వాంతి చేసుకున్నాడు సారయ్య.

అది మొదలు కోతిని పట్టుకుని వీధి వీధి తిరుగుతూ డబ్బులు అడుక్కునేవాడు. సాయంత్రం అయ్యేసరికి వచ్చిన డబ్బు, అన్నం ఆ వ్యక్తికి ఇచ్చేవాడు. రోజుకి వంద నుంచి రెండొందల రూపాయలు వచ్చేవి. తక్కువ డబ్బులు వచ్చిన రోజున వీపు వాసేట్లు కొట్టేవాడు. ఆ నరకం భరించలేక పారిపోయేందుకు ప్రయత్నించేవాడు సారయ్య. వెంటనే అతనివెంట ఉన్న కోతి 'కిచ కిచ'మని నానా హడావుడి చేయడం, ఆ వ్యక్తి చూడడం జరిగింది.

ఓ సారి ఆ వ్యక్తి తాగొచ్చి, సారయ్య ముక్కు పగలగొట్టాడు. కాళ్లపై రాళ్ల వేశాడు. అరికాళ్లలో సీలలు గుచ్చి అంగవికలుడ్ని చేయడానికి ప్రయత్నించాడు.

సారయ్యకు ఈ బాధ నుండి పయటపడే మార్గం తోచలేదు. ఓ రోజు వచ్చిన మూడు వందల రూపాయల నుంచి కొంత ఖర్చు పెట్టి చికెను పొట్లం, నాటు సారా సీసా కొని ఆ వ్యక్తికిచ్చాడు. అది చూసి ఆ వ్యక్తి...

'సారిగా! నా మీద నీ కెంత ప్రేమరా. ఏ తల్లిగన్న బిడ్డవురా నువ్వు. ఇటు దామ్మా!' అని దగ్గరికి పిలిచి చెంప వాసేట్లు కొట్టాడు. తిని తాగి మత్తుగా పడుకున్నాడు.

ఇదే అదననుకుని అక్కడ్నించి పారిపోయాడు సారయ్య. బస్టాండులో ఓ కండక్టరికి తన గోడు వినిపించాడు. అతను జాలిపడి,

'అయ్యో పిలగా! హైదరాబాదుల ఏడేండ్ల సంది గిసంటి శెర పడ్డావురా. నిన్ను జూస్తే మీ అమ్మయ్యలు ఎంత సంబర పడ్తరో. బస్సెక్కు బిడ్డా, మీ ఊర్లో దింపుతా' అన్నాడు.

సారయ్య కళ్లెంట నీళ్లు వచ్చాయి. సీట్లో కూర్చున్న సారయ్యకి తనను బంధించిన వ్యక్తి గుర్తొచ్చాడు.

'ఎంతమందిని ఎన్ని రకాలుగా హింసపెట్టిండు. మంచిగ తెల్లగున్న పిలగాన్ని దెచ్చి హోటల్లో నాల్గు వేలకి అమ్మిండు. తంగేటి పూల లెక్కున్న ఆడపిల్లల్ని దెచ్చి ఏదో కంపెనీకి అమ్మిండు. గిచ్చితే రక్తమొచ్చేట్లున్న పసి పోరగాన్ని దుబాయ్‌కమ్మిండు. కళ్లముందు పారిపోతున్న కుర్రోన్ని తల పగలగొట్టి బొంద పెట్టిండు...' ఇవన్నీ గుర్తొచ్చిన సారయ్యకు దుఃఖం ఆగట్లేదు.

'హాస్టల్లుండొచ్చి ఏడేండ్లాయె. నాగడేం జేస్తండో!' హాస్టలన్నంలో పురుగులున్నాయిని బిస్కెట్లకాశపడ్డే గింత శని మొయ్యాల్సొచ్చె. నాయనమ్మెట్లుందో! అమ్మయ్యలెట్లున్నరో!.

సారయ్య ఊరు రాగానే కండక్టరు దింపాడు. కండక్టరికి రెండు చేతులెత్తి దండం పెట్టాడు సారయ్య.

ఊళ్లోకి వస్తూంటే జనం అంతగా పట్టించుకోలేదు. సారయ్య నేరుగా తన నాయనమ్మ దగ్గరికి పోయి, 'అవ్వా! నేనే సారిగాడ్ని' అంటూ భోరున ఏడ్చాడు. ఆ ముసలమ్మ నోట మాట ఒక్కసారిగా ఆగినట్లయింది. వెంటనే తేరుకుని,

' ఏ ముత్తి! నీ కొడుకొచ్చిండే. ఓరి లింగా! నీ సారిగాడొచ్చిండు' గట్టిగా అరిచింది.

ముక్కుదూలం విరిగి, ఒళ్లంతా మట్టి, గాయాల్తో తల జడలు కట్టి ఉన్న కొడుకుని కొద్ది సేపట్లోనే గుర్తు పట్టి వలవలా ఏడ్చారు తల్లిదండ్రులు.

'తల్లిబిడ్డల్ని ఎడబాపిన ఆ రాచ్చసుడికి సావు రాను. ఎంతమంది ఉసురులోసుకుంటండో ఆ దొంగోడు. నా బిడ్డను నాకు జేర్చిండు దేవుడు' ఏడవసాగింది సారయ్య తల్లి.

ఊరు ఊరంతా కదిలొచ్చింది. నాగన్న కూడా వచ్చాడు. తన స్నేహితుడ్ని చూసి భోరున విలపించాడు.

ఆ సాయంత్రం పత్రికల వాళు వచ్చారు. సారయ్య తల్లిని మాట్లాడమన్నారు.

'ఏం మాట్లాడేది కొడకా! నా కొడుకు నాకు దక్కిండు. మాబువ్వ మేందింటన్నం. ఒకరి సొమ్ము మాకొద్దు. తల్లిదండ్రుల నుండి బిడ్డల్ని ఎడబాపేటోళ్లున్నరు. ఏడేండ్ల యాతన. ఒక్క నిమిషంల ఏం జెప్తమయ్యా? మీ బిడ్డల్ని జర భద్రంగా సూస్కోండి తల్లుల్లారా! బిడ్డల్ని సీటికి మాటికి కొట్టకండి. బిడ్డలు అలిగితే, వాళ్లే సదురుకుంటరని అనుకోకరి. సదువు రాకపోతే ఇగ ఇంతే సంగతనుకోకురి. తీరొక్క తురువులు. ఎవర్కి తోసిన కొలువు వాళ్లే జూస్కుంటరు. పొల్లగాండ్లు తెర్లైతే ఎట్ల? అందరికి దండాలు'.

★

ఎప్పుడూ ఇంతేనా?



"పెళ్లయిన కొత్తలో భర్త మాట్లాడతాడు భార్య వింటుంది, తర్వాత భార్య మాట్లాడుతుంది భర్త వింటాడు ఆ తర్వాత ఇద్దరూ మాట్లాడతారు. వీధిలో వాళ్లు వింటారు" అన్న చలోక్తి చాలా కాలంగా చలామణిలో వుంది. హాస్యం కోసం కనక ఫర్వాలేదు గాని ఇందులో ఆలోచించవలసిన అంశాలు చాలా వున్నాయి. ఇంతకూ భార్యాభర్తల వాదోపవాదాల తీవ్రత ఎంతగా వుంటుందో మాత్రం దీన్ని బట్టి తెలుస్తుంది. గట్టిగా మాట్లాడటం, మాట్లాడక పోవడం మాత్రమే ఇక్కడ సమస్య కాదు.

అన్యోన్య దాంపత్య జీవితానికి సంబంధించిన సూత్రాలు, వైవాహిక శాంతికి సంబంధించిన కథలు చాలా వున్నాయి. భార్యను లేదా భర్తను లొంగదీసుకోవడం ఎలా వంటి పుస్తకాలు చాలా కాలంగా వుంటున్నాయి. ఇవన్నీ హాస్యాస్పదమైనవే గాక హానికరమైనవి కూడా. జీవితాంతం పెనవేసుకున్న ఒక అపురూప అనుబంధంలో ఆధిక్యతల ప్రశ్న రానేకూడదు. మనది పురుషాధిక్య సమాజం గనక ఆ మేరకు భార్యలు ఎలాగూ సర్దుకుంటూనే వుంటారు. దాన్ని పక్కన బెడితే దైనందిన వ్యవహారాలలో కీలక విషయాలలో పరస్పరం అవగాహన పెంచుకోవడం ఎలా? అసహనం నివారించుకోవడం ఎలా అన్నది ఆలోచించవలసిన విషయం.

మొదట్లో అనుకున్నట్టు ఎవరి మాట ఎవరు వినాలన్న ప్రశ్న రానేకూడదు. ఎవరు చెప్పేది సరైందైతే ఎవరు సకాలంలో సరైన మాట చెప్పగలిగితే దాన్ని అవతలి వారు వినాలి. ఈలోగా జరిగే తర్జనభర్జనల్లో ఓర్మి వహించాలి. ఎందుకంటే పరస్పరం మాట్లాడుకోకపోతే సరైన నిర్ణయానికి రావడం ఎవరి వల్లా కాదు. నిర్ణయానికి వచ్చేముందు వివిధ కోణాల నుంచి పరిశీలన చేయడం తప్పని సరి. ఆ సందర్భంలో ఎవరికి తోచింది వారు చెబుతారు. అంతటితోనే కొంప మునిగిపోతుందని కోపతాపాలకు గురి కానవసరం లేదు. నీవెప్పుడూ ఇంతే నీవెప్పుడూ ఇంతే అని ఒకరినొకరు ఆడిపోసుకోవలసిన అవసరం అంతకన్నా లేదు.ఎందుకంటే భార్యాభర్తలకు ఎవరు ఏమిటో, ఏ విషయంలో ఎలా స్పందిస్తారో, ఏ క్షణంలో ఎలా వ్యవహరిస్తారో పూర్తిగా అర్థమై వుంటుంది(లేదా కావాలని అర్థం కాకుండా వ్యవహరిస్తారన్న సత్యమైనా తెలిసి వుంటుంది). అందువల్ల తెలిసిన దాన్నే మరోసారి పరీక్షకు పెట్టి నిర్ధారించుకుని దానిపైనే మళ్లీ కోపగించుకుని రసాభాస చేసుకోవలసిన అగత్యం ఎంత మాత్రం వుండదు.

తెలివితేటలు, కుటుంబ నేపథ్యాలు, గ్రహింపులో తారతమ్యాలు, పట్టు విడుపులు పరిపక్వతలు వీటన్నిటిలో భార్యాభర్తల మధ్య తేడాలు చాలా వుంటాయి. నూటికి నూరు పాళ్లు ఒకేలా వుంటామని ఢంకా బజాయించే దంపతులైనా సరే సమయాన్ని బట్టి భిన్నంగా స్పందించే అవకాశం ఎప్పుడూ వుంటుంది. రియాల్టి షోలు కృత్రిమమైనవైనా వుభయుల ఆలోచనల్లో వుండే తేడాలను చాలా సార్లు వెల్లడిస్తుంటాయి. అది అతి సహజమే గాక వాంఛనీయం కూడా. ఎందుకంటే ముందే కథ రాసుకున్నట్టు భార్యాభర్తలు ప్రతి దాంట్లోనూ ఒకే మాట సెలవిస్తుంటే ఒకే విధంగా ఆలోచిస్తుంటే ఇక కుటుంబంలో వైవిధ్యానికి గాని కొత్త కోణాల ఆవిష్కరణకు గాని అవకాశమే వుండదు. మామూలుగానే గానుగెద్దు వ్యవహారంతో పోల్చే మధ్య తరగతి జీవితాలు మరింత యాంత్రికంగా మారిపోతాయి. పరస్పర గౌరవం ప్రజాస్వామిక తత్వం వున్నంత వరకూ ఎంతటి భిన్నాభిప్రాయాలనైనా ఆహ్వానించవచ్చు. కలసి మాట్టాడి పరిష్కరించుకోవచ్చు.

వృథా వాదోపవాదాలు మనస్తాపాలకు దారి తీస్తాయి. కనీసం తాత్కాలికంగానైనా కలత కలిగిస్తాయి. కొంతమంది హఠాత్తుగా స్తబ్దతకు లేదా సంఘర్షణకు గురవుతుంటారు. ముఖ్యంగా మహిళలు అసలు సమస్యకు అభద్రత తోడై ఇలాటి సందర్భాల్లో తల్లడిల్లిపోతుంటారు. వారి అభద్రతను పారదోలి ఆత్మ విశ్వాసం కలిగించేందుకు పతిదేవుళ్లు గాని కుటుంబ సభ్యులుగాని సహకరించరు. ఇంటా బయటా వుండే శాడిస్టులు వారిని ఇంకా వేదనకు ఆందోళనకు గురి చేస్తుంటారు. ఇదంతా జరక్కూడదంటే అన్యోన్య సంబంధాల్లో అపార్థాలు పెరక్కుండా జాగ్రత్త వహించాలి. సంభాషణా సరళి సక్రమంగా వుండేలా చూసుకోవడం అందుకు మొదటి మెట్టు.

అవతలి వారు చెప్పేది మన భావాలకు అనుగుణంగా వుందా లేదా అని మాత్రమే గాక హేతుబద్ధంగా వుందా అని చూడటం చాలా అవసరం. వారు తీవ్రంగా మాట్లాడుతున్నా అది విషయానికి పరిమితమా లేక మరేదైనా ఉద్దేశం వుందా అని పరిశీలించాలి. ఫలానా మార్గం వల్ల మంచి జరుగుతుందని నిజంగా నమ్మి చెబుతుంటే దాన్ని వెంటనే తోసిపుచ్చే బదులు వ్యవధినిచ్చి పరిశీలించాలి. అంత వ్యవధి లేదనుకుంటే అప్పుడే వివరంగా అడిగి తెలుసుకోవాలి.నా మాట ఎప్పుడూ పడనివ్వరని, ఎడ్డెం అంటే తెడ్డెం అంటారని ఏవో పూర్వ నిర్ధారిత భావాలు పెట్టుకుని ముందే రెచ్చిపోకూడదు. నిజంగానే అవతలి వారు మొండిగా వున్నారనుకున్నా అప్పుడు మీరు మరింత నిబ్బరంగా వుండాలి తప్ప నిప్పులు కక్కడం వల్ల ఫలితం శూన్యం. అవతలి వారు ఫలానా విధంగా చెబుతారని ముందే అనుకుని అడగడం ఒకటైతే వారు ఫలానా కారణం వల్లనే ఇలా చెబుతున్నారని సందేహంతో స్పందించడం మరొకటి. వీటన్నిటి ఫలితం సంభాషణ సంవాదమై పోతుంది. ఎక్కువగా చెప్పడం కన్నా ఎక్కువగా అడగడం, పరోక్ష ప్రశ్నలతో అపనమ్మకాన్ని వెల్లడించడం చాలా సార్లు ఘర్షణకు దారి తీస్తుంటుంది.

త్రీ డీ చిత్రంలో వలె జీవితానికి పొడవు వెడల్పుతో పాటు లోతు కూడా వుంటుంది. నలుపు తెలుపుతో పాటు సప్త వర్ణాలు వుంటాయి. కనక ప్రతి విషయంలోనూ ప్రతివారూ ఒకేలా ఆలోచించాలని లేదు. అందులోనూ జీవితాంతం సహ జీవనం చేసే భార్యాభర్తలు నిస్సంకోచంగా తమ మనసులోని భావాలు బహిర్గతం చేసే అవకాశం ఇచ్చుకోవాలి. మళ్లీ ఒకసారి స్త్రీకోణం చెప్పాలంటే భార్యకు మనసులో భావాలను వెల్లడించే అవకాశం ఒక పిసరు ఎక్కువగా ఇవ్వాలి (తర్వాత ఎలాగూ గదమాయించడం లేదా వీటో చేయడం వుండనే వుంటుంది). అధికారంతోనో అభద్రతతోనో దాన్ని అడ్డుకుంటే అప్పుడు అశాంతి పెరగుతుందే తప్ప తగ్గదు. కుటుంబ జీవితంలో అసౌఖ్య వాతావరణం ఏర్పడిన తర్వాత జీవిత శాంతి సగమైనా ఆవిరవుతుంది. అభిమాన పూర్వకమైన రీతిలో అరమరికలు లేకుండా మాట్లాడుకోవడం వల్ల అశాంతి మటుమాయమై పోవడమే గాక ఆహ్లాదం పరుచుకుంటుంది.

- పీపీ

ఫేస్‌బుక్, ట్విట్టర్, ఆర్కుట్ వెబ్‌సైట్లు సోషల్ నెట్‌వర్కింగ్‌కు పర్యాయపదాలుగా మారిపోయాయి. ఈ వెబ్‌సైట్లకు అంతటి ఆదరణ ఉంది మరి. ఇప్పుడు కొత్తగా తెలుగు వారికోసం తెలుగులో ఇలాంటి వెబ్‌సైటే అందుబాటులోకి వచ్చింది. అమెరికాలో ఉంటున్న తెలుగువాడు జ్యోతికిరణ్ 'తెలుగుకింగ్‌డమ్' (www.telugukingdom.net) పేరుతో ఒక వెబ్‌సైట్‌ని రూపొందించాడు. దేశవిదేశాల్లో ఉండే తెలుగువారి గురించి ఈ సైట్‌లో తెలుసుకోవచ్చు.



తెలుగుకింగ్‌డమ్.నెట్

ఒక్క క్లిక్‌తో జగతిలోని తెలుగు వారి చిరునామా

మీరు పుట్టి పెరిగిన ఊరు, మండలం, జిల్లా వారు మీ ఇంటి పక్కనే వుండవచ్చు లేదా ఇంక ఎక్కడైనా వుండవచ్చు. వారికోసం ఇకముందు వెతకవలసిన అవసరం లేదు. ఉదాహరణకు మీరో చిన్న పల్లెటూరి నుంచి వచ్చి హైదరాబాద్‌లో ఉంటున్నారనుకుందాం. మీ ఊరి నుంచి వచ్చి ఇక్కడ నివసిస్తున్న వారి గురించి తెలుసుకోవాలంటే ఈ వెబ్‌సైట్‌ని క్లిక్ చేయండి. అప్పటికే అందులో రిజిస్టర్ అయివున్న వారి వివరాలు మాత్రమే తెలుస్తాయి. అందుకు మన రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలాలను, గ్రామాలతోపాటు ప్రపంచంలోని 294 దేశాలను, 4924 రాష్ట్రాలను, 134594 పట్టణాలను దీనిలో ఇవ్వడం జరిగింది. మీరు చేయవలసినదల్లా ఒక్కటే... ఆ సైట్‌లోకి వెళ్ళి మీరు ఏ ప్రాంతమో ఎంపిక చేసుకోవడమే. మీరు పుట్టి పెరిగిన ఊరు, మండలం, పట్టణం/నగరం, జిల్లా లేక మీకు నచ్చిన ప్రాంతం వారు ఎక్కడెక్కడ ఉన్నారో ? లేక మీరు ఉంటున్న ఇంటి పక్కనే ఉండవచ్చేమో? తెలుసుకోవచ్చు. మీరు ఉంటున్న లేక కావలిసిన ప్రాంతం నుండి కావలసినంత దూరంలో మన తెలుగు వారు ఎంత మంది ఉన్నారు, వారు ఏ ప్రాంతానికి సంబంధించిన వారో తెలుసుకోవచ్చు.

ఇవే కాకుండా మన తెలుగు వారికి ఆర్కుట్, ఫేస్‌బుక్ లేక ట్విట్టర్ లాంటి ఒక సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ ఒకటి వుంటే బాగుండుననిపిస్తోందా? దానికి సమాధానమే www.telugukingdom.net. ఆర్కుట్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో ఉండే అన్ని ఆప్షన్లూ ఈ వెబ్‌సైట్‌లో ఉన్నాయి. ఒక్కసారి క్లిక్ చేసి ప్రపంచంలోని తెలుగు వారి చిరునామాలను తెలుసుకునే విధంగా ఇంటరాక్టివ్ గ్రాఫ్‌తో ఈ వెబ్‌సైట్ తీర్చిదిద్దబడినది. వివరాల్లోకి వెళితే...

ప్రపంచవ్యాప్తంగా....

ఇక్కడ మన తెలుగు వారు ఏ ఏ దేశాలలో ఎంత మంది ఉన్నారు? మీ జిల్లా వారు ఏ ఏ దేశాలలో ఎంత మంది ఉన్నారు? అని ఒక అందమైన గ్రాఫ్‌లో ఇవ్వబడింది. మనకు కావలసిన దేశంపై క్లిక్ చేస్తే ఆ దేశములో ఏ ఏ రాష్ట్రంలో ఎంతమంది ఉన్నారో చూపుతుంది. ఇంకా రాష్ట్రంపై క్లిక్ చేస్తే ఆ రాష్ట్రంలో ఉన్న పట్టణాలలో మనవారు ఎంతమంది ఉన్నారో చూపుతుంది. అంతేకాకుండా పట్టణాలపై క్లిక్‌చేస్తే వారి వివరాలు ఇవ్వబడతాయి. గ్రాఫ్‌తో పాటు పట్టిక (లిస్టు బేసేడ్) ద్వారా కూడా వివరాలు పొందవచ్చు. ఇక్కడ ఇంకొక విషయం మీరు ప్రస్తుతం ఉంటున్న ప్రాంతాన్ని కూడా ఇవ్వవలసిన అవసరం లేదు. మీరు వుంటున్న సిటీని మన సిస్టమే ఆటోమాటిక్‌గా కనుగొంటుంది.

మీ ప్రాంతం....

మన రాష్ట్రంలో ఉన్న 23 జిల్లాలను, 1106 మండలాలను, 1258 పట్టణ నగరాలు, 51216 గ్రామాలను ఇచ్చారు. ఇందులో మీరు పుట్టి పెరిగిన లేక మీకు నచ్చిన ప్రాంతాన్ని ఎంచుకొని, మీ ప్రాంతం వారిని ఇంటరాక్టివ్ గ్రాఫ్‌తో కలవండి. కావాలంటే ఇక్కడ ఒకే క్లిక్‌తో మీ ప్రాంత వాసులందరినీ చూడవచ్చు.

ఒంటరి ప్రయాణం చేయాలనుకుంటున్నారా...

ఈ ప్రపంచంలో ఎక్కడికైనా ఒంటరిగా వెళుతున్నారా? అక్కడ ఎవరన్నా తెలిసిన వారి కోసం వెతుకుతున్నారా ? ఇక మీరు వెతకవలసిన, ఒంటరి అనే సమస్య లేదు. మీరు వెళ్లవలసిన ప్రాంతం నుండి, మీకు కావాల్సిన దూరంలో ఉన్న మన తెలుగు వారినందరినీ ఇక్కడ కలవవచ్చు. మీరు వెళ్ళే ప్రాంతం నుండి అక్షాంశాలు, రేఖాంశాలు వాడి మీకు దగ్గరగా ఉన్న అన్ని ప్రాంతాలను అక్కడ తెలుగు వారిని ఇవ్వటం జరిగింది. తద్వారా మీరు వారి నుండి సహాయాన్ని పొందవచ్చు.

నేను ...

దీనిలో ఫేస్‌బుక్, ట్విట్టర్, ఆర్కుట్ వంటి సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లు ఏరకంగా ఉపయోగపడతాయో ప్రస్తుతం అందరికీ తెలిసిందే. వాటికి ఏమాత్రం తీసిపోని రీతిలో తెలుగు కింగ్‌డమ్‌లోనూ చేయవచ్చు. అది కూడా మీకు కావలసిన రీతిలో మీ ప్రొఫైల్‌కు అనుమతి ఇవ్వవచ్చు. మీకు ఎవరికీ పంచటం ఇష్టం లేకపోతే ప్రైవేటు చేయవచ్చు, లేక స్నేహితులతోనే పంచుకోవచ్చు. ఇక్కడ మీరు స్నేహితులను కలుపుకోవచ్చు, చాటింగ్ చేయవచ్చు, వీడియోలు మిగతా వారితో పంచుకోవచ్చు, మీ సొంత ఆలోచనలను వ్యక్తపరచవచ్చు, మీకు ఇష్టమైన లింక్స్ మిగతా వారితో పంచుకోవచ్చు. మన తెలుగువారిని ఇక్కడ కూడా సెర్చ్ చేయవచ్చు.

చిన్నారులకోసం...

ఇది పిల్లల కోసం రూపొందించబడింది. దీనిలో ఇంగ్లీష్‌లో 56, తెలుగులో 51 లింక్స్ వున్నాయి. వీటిలో రామాయణ, మహాభారతం దగ్గర నుండి పిల్లలు అమితంగా ఇష్టపడే రైమ్స్, వేమన, తెనాలిరామలింగ వంటి కార్టూన్ సినిమాలను వుంచారు. ఇంతే కాకుండా కాలక్షేపం కోసం ఫోరమ్స్ కూడా ఇవ్వటం జరిగింది. దీనిలో రకరకాల అంశాలపై మన అభిప్రాయాలను వెల్లడించవచ్చు.

ఈ సైటను ఏ విధంగా ఉపయోగించుకోవచ్చంటే....

➧ ఎవరన్నా కొత్తగా విదేశాలకు (విదేశాలకే కాదు మన రాష్ట్రం బయట ఉన్న వారికి అయినా) వెళ్ళే వారికి ఇక వెతుక్కునే అవసరం లేదు. ఎవరు ఎక్కడ వున్నారో తెలుస్తుంది. రాష్ట్రంలో ఏ ప్రాంతం నుండో కూడా తెలుస్తుంది. చివరకి వారి సొంత ఊరు వారు అయినా, లేక మండలం వారు అయినా .. లేక ఏ ప్రాంతం వారు అయినా తెలుసుకోవచ్చు. ➧ అలా కాకుండా బయట ఎక్కడ ఉన్న మన తెలుగు వారు ఎవరయినా, వారి దగ్గరలో లేక వారి అపార్ట్మెంట్‌లో వున్న వారి నయినా కలవవచ్చు. ఇక అపార్ట్మెంట్‌లో ఒంటరిగా ఉండే ప్రసక్తే లేదు. ➧ ఏవైనా కార్యక్రమాలు జరుగుతుంటే ఆ ప్రాంతములో ఉన్న వారి అందరికి ఒక్క ఈమెయిల్‌తో తెలపవచ్చు. ➧ ఇలా బయట వారికే కాదు మీ జిల్లా, మండలం, మీ గ్రామం వారు లేక మీకు ఇష్టం వచ్చిన ప్రాంతం వారు ఎక్కడున్నారో తెలుసుకోవచ్చు. ఇలా గ్రామానికి సంబంధించిన వారంతా ఒక్క చోట కలవటానికి అవకాశం ఉంది. ➧ మన వారికి ఇష్ట మొచ్చిన ప్రాంతం నుండి కేవలం దూరం ఇచ్చి సెర్చ్ అంటే చాలు, అంత దూరంలో వున్న తెలుగు వారు అంతా వస్తారు. ➧ అంతేకాకుండా స్నేహితులనూ కలుపుకోవచ్చు, చాట్ చెయ్యవచ్చు, ఇంకా అన్ని ఆర్కుట్, ఫేసుబుక్ లేక ట్విట్టర్ లోని అన్ని సౌకర్యాలు ఉన్నాయి.

- కె.ఎక్స్.రాజు

బాల కథ

మరణ దృశ్యం

రాయగిరిని పాలించే, రాగవర్మకు వింత కోరిక కలిగింది. తను మరణిస్తే ఎలా వుంటుందో చూసుకోవాలనిపించింది. రాజ్యంలోని చిత్రకారులందరిని పిలిపించి "నా మరణ దృశ్యం చిత్రించండి. ఉత్తమంగా వున్న చిత్రానికి లక్ష వరహాల బహుమతి ఇస్తాను" అని ప్రకటించాడు. నెలరోజులు గడువిచ్చాడు.

బొమ్మలు గీసిన చిత్రకారులందరూ తాము వేసిన చిత్ర పటాలను తెచ్చారు. ఒక్కొక్కరు వచ్చి రాజుకు చూపించసాగారు.

ఓ చిత్రకారుడు తైల వర్ణంలో మరణించిన రాజు తలవైపు దీపం పెట్టి వుంది. రాణులు, రాజ ప్రముఖులు అందరూ దుఃఖిస్తున్నట్లు చిత్రించాడు. రాజుకెందుకో అది నచ్చలేదు. దాన్ని పక్కన పెట్టాడు. మరో చిత్రకారుణ్ణి పిలిచాడు. అతని చిత్రంలో రాజు శవం రాజధాని వీధుల గుండా రథంపై వెళ్తుంటే దారికి ఇరుపక్కలా ప్రజలు నిలబడి, దుఃఖ వదనాలతో చూస్తున్నట్లుగా వుంది. అదీ నచ్చలేదు. దాన్నీ పక్కన పడేశాడు.



మరో చిత్రకారుడు రాజుగారు తన తల్లిఒడిలో మరణించినట్లు, తల్లి దుఃఖిస్తున్నట్లు చిత్రించాడు. మరొకరు భార్య పక్కనుండగా, అంతఃపురంలో మరణించినట్లుగా చూపించారు. ఇలా రకరకాలుగా చిత్రించారు. అన్నీ చూశాడు కానీ, రాజుకు అవేవీ నచ్చలేదు.

చివరిగా సుధా చంద్రుడు గీసిన చిత్రం మిగిలింది. దాన్ని అందుకుని చూశాడు.

బాలనేస్తం

అది ఒక యుద్ధరంగం. నేలంతా రక్తంతో తడిచి వుంది. గుర్రాలు, ఏనుగులు గాయపడి హాహాకారాలు పెడుతున్నాయి. కొన్ని మరణించి వున్నాయి. అనేకమంది సైనికుల శిరస్సులు తెగిపడి వున్నాయి. కొంతమంది క్షతగాత్రులై పడి వున్నారు. "ఇదేంటి? నా మరణ దృశ్యం చిత్రించమంటే యుద్ధరంగాన్ని గీశావు? నేను మరణించింది ఎక్కడ?" అడిగాడు రాజు.

"అక్కడ మరణించిన సైనికులతో పాటు మీరు కూడా వున్నారు మహారాజా" అన్నాడు. అవును, సైనికులు మరణించాకే కదా రాజు మరణించేది అనుకున్నాడు. "నేను యుద్ధరంగంలోనే ఎందుకు మరణిస్తాననుకున్నావు. వ్యాధితోనో, హఠాత్తుగా జబ్బు చేసో చనిపోనని నమ్మకమేంటి?" ప్రశ్నించాడు రాజు సూటిగా.

వీరులెప్పుడూ యుద్ధ రంగంలోనే మరణిస్తారు మహారాజా. అక్కడి నుండే స్వర్గానికి చేరుకుంటారు. సామాన్యుల్లా వ్యాధులతోనూ, బాధలతోనూ కృశించి మరణించరు" అన్నాడు. రాజుకు మహదానందమనిపించింది. గర్వంగా చిరునవ్వు నవ్వాడు.

"నువ్వు నాకు నచ్చావు. నీ బొమ్మ నాకు నచ్చింది. నువ్వు చెప్పిన తీరు ఇంకా బాగా నచ్చింది. నువ్వు గీసిన చిత్రాన్నే ఉత్తమ చిత్రంగా ప్రకటిస్తున్నాను. ఇదుగో లక్ష వరహాలు" అంటూ వరహాల మూటను ఆ చిత్రకారునికి అందించాడు. ఆ చిత్రాన్ని తన అంతరంగిక మందిరంలో పెట్టించాడు. ఆ మాత్రం ఆలోచన తమకు రానందుకు చిత్రకారులంతా తెగ బాధపడిపోయారు.

- పుప్పాల కృష్ణమూర్తి

ఐదు చేపలు గప్‌చుప్

బుజ్జాయిలూ...బంటి సరదాగా చేపలు పడదామని చెరువు దగ్గరకొచ్చాడు. కానీ చెరువులోని చేపలన్నీ ఒడ్డుకు చేరాయి. అందులో ఓ ఐదు చేప పిల్లలు బంటి చుట్టూనే దాక్కొని ఉన్నాయి. కానీ బంటికి కనిపించలేదంట. మీకేమయినా కనిపించాయా?

బయటపడాలంటే...

బుజ్జాయిలూ...చూడండి పాపం... ఈ ఇద్దరు బుడతలు పెద్ద జార్‌లో పడిపోయారు. ఒకడేమో బయటికి వచ్చేశాడు. రెండోవాడు రావడానికి దారి అర్థం కాక తెగ అవస్థ పడుతున్నాడు. మీరేమైనా సాయం చేస్తే బయటికి వచ్చేస్తానంటున్నాడు. చేస్తారా మరి.





ఏమేం వున్నాయి?

చిన్నారులూ... ఇక్కడో విచిత్రమైన ప్రాణి వుందా! అందులో కొన్ని జంతువుల శరీర భాగాలున్నాయి. వాటిని గుర్తించి అవేంటో చెప్పండి.

ఏం దాక్కుంది?

హలో... ఇక్కడున్న చుక్కల్లో ఏం దాగుందో తెలుసా? అదేంటో తెలియాలంటే 1 నుంచి 60 వరకు ఉన్న చుక్కల్ని వరుసగా కలిపేయండి.



1. A FLYING MAMMAL IS A ______
2. A BIG RODENT IS A ______
3. WHAT YOU DO TO A MOSQUITO.
4. A 'COUSIN' OF THE SILVERFISH.
5. A 'TAXI' FOR SOME FLEAS.



ఆ పదాలు ఏంటో...

చిన్నారులూ...మీ ఇంగ్లీషు పరిజ్ఞానానికో పరీక్ష. పక్కన కొన్ని గళ్లున్నాయి. చూశారుగా. వాటిలో చివర రెండక్షరాలు మేమిచ్చాం. వాటి ఆధారాలు ఆ పక్కనే రాసి ఉన్నాయి. వాటిని చదివి ఖాళీలని నింపేయండి. సరేనా.

జవాబు : 1.bat, 2.rat, 3.swat, 4.firebrat , 5cat

రంగులు వేసేద్దాం

పిల్లలూ... ఇక్కడ కొన్ని ఇంగ్లీషు అక్షరాలు ఉన్నాయి కదా.వాటిలో O దగ్గర చాక్లెట్ రంగు, X దగ్గర పసుపు, T ఉన్నచోట నీలం రంగు వేయండి. ఏం కనిపిస్తుందో చూడండి.



మాటల కోట - 37

రూపకల్పన: వెంకట సుబ్బారావు కావూరి



అడ్డం :

1. భీముడి ఆయుధం (2)
2. వస్త్రోత్పత్తి, సేవలో ఇదే కీలకం (2)
4. సముద్రమే (3)
6. విధానం, క్రమం, తీరు (3)
7. నష్టం కాదు ఆదాయం. అయితే ఇది దారి మార్చిందండోయ్, గమనించండి! (2)
8. కనిష్ట సామాన్య గుణిజం పొట్టిగానూ, కొంత గందరగోళంగానూ (3)
9. సరాసరేగానీ అటు నుంచి ఇటు వచ్చింది (3)
10. ఆనవాయితీ, ఆచారం, సంప్రదాయం, వాడుక (3)
12. రాజుగారి ఏడు కొడుకులు తెచ్చిన చేపల్లో ఎండని ఒకటి (2)
14. అవునని ఒ,ఓ, ఔలలో ఒక అక్షరంతో చెప్పండి (1)
15. క్రమంతప్పిన ఉపయోగం, వ్యవహారం (3)
17. సంపద (3)
20. రథం మీద ప్రయాణించేవాడు. అయితే ఇక్కడ ఒత్తు త కాదు, ఒత్తు ద చాలు (4)
23. స్నానం చేసి తుడుచుకునేది. గ్రామీణుల భుజం మీద కన్పించేది చెల్లాచెదురయింది (3)
25. తప్పు వరుస, క్రమంతప్పిన గమనిక ...ఇక్కడ కూడా అదే అయింది (4)
28. అతకని సింగారింపు (5)
29. ఆధారం, దేనికయినా ఇది ముఖ్యమేగానీ ఇంటికి మరీ గట్టిగా అవసరం (3)

నిలువు :

1. కదలిక, మార్పు (2)
2. నమ్మకం, ఆసక్తి (2)
3. ఇక్కడ తడబాటు తారుమారయింది (4)
4. చివరిసారి (4)
5. కొడవలి కంటే చిన్నది. రెండో అక్షరం 'కి' కు 'క' వత్తు (2)
6. జీడిపప్పుకు రాష్ట్రంలో ఈ ప్రాంతం కూడా వేటపాలెం అంతటి ప్రసిద్ధి (3)
7. అవమానపడు, మోసపోవు (4)
9. కింద నుంచి పైకొచ్చిన ముప్పు, నాశనం (2)
11. ఇంటికి రాకపోకలు సాగించాలంటే ఇది కావాల్సిందే (3)
13. రెండింటిని కలిపేది ఇక్కడ అటూ ఇటూ అయింది. వాడుకలో వంతెన (3)
16. కత్తి. ఖడ్గం. రాజభాషలో రాయాలంతే (4)
18. ఎత్తయిన చోటు, వేదిక, రచ్చబండ (2)
19. పండుగ, సంతోషంగా జరుపుకునే కార్యక్రమం (3)
21. అరకు మాదిరిగా ధ్వనించే కింద నుంచి ద్రావకం (3)
22. దారి మార్చిన పలుపు, నారతో వేసేది, చీకట్లో దీన్ని చూసి పాము అనుకోవటం కద్దు (2)
24. కింద నుంచి విధం, రంగు (2)
26. తుడిపేయు, సాయంకాలం (2)
27. కొన్ని పైర్లకు ముందస్తు ఇదే. ఇది పోసినవాడు నీరు కూడా పోస్తాడని తెలుగు సామెత (2)

మాటలకోట - 36జవాబు

	1 దా	క్వా		2 ఉ		3 తా	4 ళం	
5 జ	నం		6 ఆ	గ్ర	7 హం		8 మే	9 క
గం		10 గం	రా		11 స	12 ద్దు		ల్లం
	13 ఉ	ప		14 వే		15 హ	16 లం	
17 భా	రం		18 ధ	మ	ని		19 క	సి
	20 ద	21 న్ను		న		22 బా	ణం	
23 పు		24 క	25 క్ష		26 పా	లు		27 సూ
28 ట్ర	29 కు		30 మ	31 మ	త		32 పా	త్రం
	32 సా	ర్వా		ర		34 సా	త్తు	

శభాష్ శాండీ!

శాండీ ఎవరా అని ఆరా తీస్తే... తెలిసింది! శునకమని. ఇది అట్టాంటి ఇట్టాంటి కుక్క కాదండీ బాబూ. దానికి పనిపాటలన్నీ తెలుసు. ఇది చేస్తుంది ఇది చేయదు అని లేదు. తన యజమానురాలు స్యూ లైన్‌కు అవసరమైన పనులన్నీ చేసి పెడుతుంది. ఆ జాబితా అంతా చెప్తే...గుడ్లు తేలేయాల్సిందే.

అరవైఒక్కేళ్ల స్యూ లైన్‌కు నడుము కింది భాగం చచ్చుబడిపోయింది. కొత్త సంవత్సర వేడుకల్లో దొర్లిన అపశృతే అందుకు కారణం. ఆరోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో లైన్ తన కారులోంచి ఒక్క ఉదుటున బయటికి వచ్చిపడింది. అంతే అప్పటినుంచి కుర్చీకే పరిమితమైందామె. ప్రతిదానికీ ఎవరో ఒకరి మీదే ఆధారపడాల్సివచ్చింది. అప్పుడు రోజుల వయసున్న శాండీని మిత్రులెవరో బహూకరించారామెకు. ఆ నాటినుండి శాండీ లేకుండా లైన్‌కు క్షణం గడవదు. శాండీ పొద్దున్నే పోస్ట్ తెచ్చిస్తుంది. మోగంగానే ఫోన్ తెచ్చిస్తుంది. మాసిన బట్టల్ని వాషింగ్ మెషీన్లో వేస్తుంది. అందులో బరువాటివి ఒకసారి, తేలికపాటివి మరోసారి వేస్తుంది. షాపింగ్‌కెళితే సరకుల సంచి మోస్తుంది. కౌంటర్లో డబ్బు తనే ఇస్తుంది. ఇలా చెప్పకుంటూ పోతే పెద్ద జాబితానే అవుతుంది. కాకపోతే ఒక సమస్య వుంది శాండీతో! ఎప్పుడైనా రెస్టారెంట్లకు వెళ్లినప్పుడు...ఏదైనా రుచికరమైన వంటకం వాసన తగిలిందంటే చాలు ఆగిపోతుంది. ఇక్కడ మాత్రం శాండీని ఆపడం కష్టం. అయితే ఈ పనులన్నీ చేసేలా శిక్షణ ఇవ్వడానికి రెండేళ్లు పట్టింది. ఇవన్నీ తెలిసినవారెవరైనా సరే 'శభాష్ శాండీ' అనేస్తారు.

SIETK

SIDDHARTH INSTITUTE OF ENGINEERING & TECHNOLOGY

An ISO 9001:2000 Certified Institution

Affiliated to JNT University, Anantapur and Approved by AICTE, New Delhi,

PUTTUR: 517583, Chittoor Dist. Contact Nos: 96425 04764, 93969 44144, 93969 32888, 93969 37888

EAMCET COUNSELLING CODE

B.Tech - (SDTN)

MBA/ MCA- (SETP)

M.Tech (SDIP)

TRANSPACIFIC CERTIFICATIONS LTD TCL

2010-2011 Proposed Courses

- M.Tech., (CAD/CAM)
- M.Tech., (Embedded Systems)

2010-11 Proposed Courses

CIVIL - 60 ECE - 60

A Unique Saga of Success

SIETK

SIDDHARTH INSTITUTE OF SCIENCE AND TECHNOLOGY

(Affiliated to JNT University, Anantapur and Approved by AICTE New Delhi)

EAMCET COUNSELLING CODE B.TECH (SIST)

Dr. K.Ashok Raju

CHAIRMAN

అందమైన చేతివ్రాత - ఉచిత శిక్షణ

Send SMS... "HRC" space "Your address" to 55352

India's No.1 Handwriting Expert, Graphologist, Graphotherapist, NLP Trainer, Handwriting Research Centre (HRC) అధినేత చదువుల డాక్టర్‌గా బిరుదాంకితులైన Sri. Bhasckarr Raaju గారి "గుడ్ హ్యాండ్రైటింగ్" ప్రత్యక్ష శిక్షణలో నిష్ణాతులైన 150 మంది శిక్షకులు రాష్ట్ర నలుమూలల వారి వారి ప్రాంతాలలో అందమైన చేతి వ్రాతను బోధిస్తున్నారు!!



HANDWRITING HOMESTUDY KIT ను

సొంతం చేసుకొన్న వారికి అందమైన చేతివ్రాతపై ఉచిత శిక్షణ!!

FREE

మీ స్పెల్లింగ్ సమస్యకు పరిష్కారం ... మీ సెల్ ఫోన్‌లో ఉచితంగా...!!

SPELLING సమస్యా...?!

పరిష్కారం కొరకు...

Send SMS... HRC space SPELL to 55352

Specially designed to... 3rd to 10th Class



ప్రపంచంలో మొట్టమొదటిసారిగా ...
అందమైన చేతివ్రాతను సొంతం చేసుకోవడానికి
రూపొందించబడిన Hai-Pad, Hai-Slate లను సొంతం చేసుకోండి!
అందమైన చేతివ్రాత మీ సొంతం అవుతుంది!!
వివరములకు దిగువ కనబరచిన మీ సమీప డిస్ట్రిబ్యూటర్స్‌ను సంప్రదించండి!!

Chittoor : Bhasckarr Raaju Enterprises, ✆ : 9966555536, Nellore : Nazeem Enterprises, ✆ : 9440928532, Guntur : Sree Vigneshwara Enterprises, ✆ : 9440022999, Vijayawada : Bee Hive Enterprises, ✆ : 9866869649, East Godawari : Excellence Enterpises, ✆ : 9440776596, Vizag : K Enterprises, ✆ : 9396409988, Warangal : Sai Agencies, ✆ : 9347551328, Ananthapur : Akshara Distributors, ✆ : 9966987577.

మిగిలిన జిల్లాల్లో డిస్ట్రిబ్యూషన్ కొరకు వెంటనే సంప్రదించండి!!

For any information feel free to contact...

eHRC

Bhasckarr Raaju ... Good Handwriting for All

HANDWRITING RESEARCH CENTRE

1-5-565 Balaji Colony, TIRUPATI.

Cell : 9000072359, 9246997139